




జంజనం శ్రీనివాసరావు కుటుంబసభ్యులతో లోకేశ్

డెల్టా.. ఉల్టా

- జగన్ పాలనలో నీరందక ఎండిన డెల్టా భూములు
- డెల్టా కాల్వలన్నీ ఛిద్రం... రైతు బతుకు దుర్భరం
- ఒక్క కాల్వకట్టపై పలిక మన్ను వేసిందిలేదు
- చుక్కనీరందక రైతులకు నాలుగేళ్లూ కష్టాలే
- పట్టిసీమకు ఆనాడు పట్టం... జగన్ పాలనలో పట్టించుకోక నష్టం

గత ఐదేళ్లలో రైతన్నకు మాత్రం ఒక సంవత్సరం వర్షాలు సకాలంలో పడితే, మిగిలిన నాలుగేళ్లు సాగునీటి కష్టాలు తప్పలేదు. అటు జలాశయాల్లో నీటి నిల్వలూ అంతంతమాత్రంగా ఉంటే, కనీసం పట్టిసీమను కూడా సరిగా వినియోగించుకోలేని అసమర్థ రైతులపాలిట శాపంగా మారింది. జగన్ సర్కారు వచ్చాక సంఘాలూ లేవు... మరమ్మతులకోసం నిధులిచ్చిన దాఖలాలూ లేవు. తూర్పు, పశ్చిమ కాల్వలకింద రెండు జిల్లాల్లో సాగుభూమి ఉంటే వాటిపైనా మరమ్మతులు నోచుకోక దిగుబడిపై పెద్ద ప్రభావమే పడింది. వర్షాలు సకాలంలో పడితే మినహా దిగుబడి దక్కిన పరిస్థితిలేదు. అటు కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్ పైనా అప్పట్లో ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయి లో జరగలేదు. జగన్ సర్కారు వచ్చాక పూర్తిగా పట్టిసీమపై కక్ష కట్టినట్టు మరీ పక్కన పెట్టారు.



తెనాలి మండలం హాఫ్‌పేట-గుంటూరు మధ్య గత ఖరీఫ్‌లో సాగునీరందక ట్యాంకర్‌లతో నీటిని పంటలకు అందిస్తున్న రైతులు



తూములు పూడిపోయి, కట్టల మట్టి కోతపడి గండ్లు పడటానికి సిద్ధంగా ఉన్నా ఖరీఫ్‌కు ముందు అత్యవసర మరమ్మతులు చేయకుండా వదిలేసిన చిత్రం



హైలెవల్ ఛానల్ పనులు చివరి దశకు చేరినా ఐదేళ్లుగా ఒక్క పనికూడా చేయకుండా రైతులకు శాపంగా మార్చిన ప్రభుత్వ తీరు

తెనాలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఒక్క కాల్వపై మరమ్మతులు చేసింది లేదు.. గండ్లు పడినా.. షట్టర్లు దెబ్బతిని నీరు వృధాగా పోయినా.. తూములు, కల్వర్టులు దెబ్బతినిపోయినా వాటికి రాయో, రప్పో అడ్డుపెట్టుకుని రైతన్నే నీటిని కాపాడుకున్నాడు. కాల్వల చివరి భూములకు ఆ అవకాశం కూడా లేదు. ఎందుకంటే.. చుక్కనీరు కిందికి వెళ్లిందే లేదు కనుక రైతులు పొలాలను ఎడారిగా వదిలేశారు. అరకొరగా వచ్చే ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్(ఓ.అండ్.ఎం) నిధులే ఆధారమైతే వాటినీ అధికార పార్టీ నాయకులే కాంట్రాక్టర్ అవతారమెత్తి మేసేశారు. దీంతో ఆ మాత్రం మరమ్మతులు కూడా లేక కృష్ణా పశ్చిమ డెల్టా కుదేలైంది. ఎప్పుడో వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డెల్టా కాల్వల ఆధునికీకరణలో భాగంగా ఈ ప్రాంతానికి రూ.1,400 కోట్లు మంజూరయితే వాటిలోనూ ప్రధాన కాల్వలు ఆధునికీకరణకు నోచుకోలేదు. తర్వాత టీడీపీ సర్కారు అధికారంలోకి వచ్చాక జరిగిన మరమ్మతులు మినహా, జగన్ సర్కారు వచ్చాక రైతన్నకు కన్నీరే మిగిల్చింది.

మరమ్మతుల కోసం రైతన్న మొక్కు..

డెల్టా కాల్వల ఆధునికీకరణ తర్వాత సాగునీటి సంఘాల ద్వారా చాలావరకు కాల్వల పనులు జరిగేవి. జగన్ సర్కారు వచ్చాక సంఘాలూ లేవు... మరమ్మతులకోసం నిధులిచ్చిన దాఖలాలూ లేవు. డెల్టా కాల్వల ఆధునికీకరణ సమయంలో కొమ్మమూరు, నిజాంపట్నం ఛానల్స్‌కు పనులే జరగలేదు. వీటికి సంబంధించి అప్పట్లోనే రూ.600 కోట్లు వృధాగా వెనక్కుపోయాయి. దీంతో ఈ కాల్వలకు గండ్లు పడటం ఏటా ఒక ఆనవాయితీగా మారిపోయింది. కృష్ణా పశ్చిమ డెల్టా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉంది. ఒక ఖరీఫ్ సాగు గట్టెక్కాలంటే కనీసం 60 నుంచి 70 టీఎంసీల నీరు అవసరమవుతుంది. అంటే పశ్చిమ డెల్టా కాల్వలకు నీరందించే ప్రధాన కాల్వకు రోజూ 8,200 క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజి నుంచి వదలాలి. కానీ ఎప్పుడూ ఇంతటి సామర్థ్యంతో నీటిని వదలటం కానీ, కాల్వల చివరి భూములకు పుష్కలంగా నీరందించిన పరిస్థితే లేదంటే అతిశయోక్తి కాదు. దీనిలో కొమ్మమూరు కాల్వయితే అన్నిటికీ చెడ్డ పరిస్థితి. అటు ఆధునికీకరణలో రూ.400 కోట్లతో జరగాల్సిన పనులు జరగలేదు. తర్వాత జల రవాణా పేరుతో తెలుగుదేశం ప్రభుత్వ కాలంలోనూ శాశ్వత పనులేవీ చేయనివ్వలేదు. తాత్కాలిక మరమ్మతులకే పరిమితం చేశారు. ఇప్పుడు జల రవాణాను నిలిపివేసినట్టు కేంద్రం ఎప్పుడో ప్రకటించినా వైసీపీ సర్కారు మాత్రం అత్యవసర మరమ్మతులుకూడా చేయలేదు. ఈ కాల్వల కింద 1.5 లక్షల ఎకరాలు సాగవుతుంటే, 63 కి.మీటర్ల పొడవున్న ఈ కాల్వపై ఒక్క పనీ జరగలేదు. దీంతో పొన్నూరు, బాపట్ల మండలాల పరిధిలో చాలాసార్లు కట్టలకు గండ్లు పడి ప్రకాశం జిల్లాలోని చివరి భూములకు గత మూడేళ్లగా నీరు సరిగా అందని పరిస్థితి.

పట్టిసీమపై పంతం పట్టి...

కృష్ణా డెల్టాకు ఎగువ జలాశయాలలో నీటి నిల్వలు అడుగుకుపోయి, ప్రాజెక్టుల నుంచి నీరు అందని తరుణంలో పంటలను దక్కించుకోటానికి పట్టిసీమ గుండెకాయలాగా ఉపకరించింది. గతంలో కృష్ణా నదిపైఉన్న జలాశయాలు నిండుకుని నీరు రాక పంటలు ఎండిపోవటంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించటానికి పట్టిసీమను తీసుకొచ్చారు. వృధాగా సముద్రంలో కలసిపోయే గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోటానికి ఆయన పట్టిసీమ ద్వారా 20 మోటార్లను అమర్చి నీటిని పంప్‌చేస్తే, జగన్ సర్కారు వచ్చాక పూర్తిగా పట్టిసీమపై కక్ష కట్టినట్టు మరీ పక్కన పెట్టారు. గత ఖరీఫ్‌లో మరీ ఇబ్బందిగా ఉండటంతో పట్టిసీమ ద్వారా 14 రోజులు మాత్రమే నీటిని తీసుకున్నారు. మిగిలిన రోజులు కూడా తీసుకోగలిగితే ప్రస్తుతం అడుగుకు చేరిన పులిచింతల నీటిని తాగునీటి కోసం తోడెయ్యాల్సిన అవసరం ఉండేది కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే సాగు, తాగునీటి విషయంలో జగన్ సర్కారు ఏ ఒక్క సంవత్సరం ఒక ప్రణాళికతో నీటిని వినియోగించిన పరిస్థితి లేదు. ఆ కాల్వలకు మరమ్మతులు చేయక, పాడైన పంపులను పట్టించుకోక నిరుపయోగం చేసేశారు. ప్రధానంగా ఈ రెండు ఖరీఫ్ సీజన్‌ల నుం చి పట్టిసీమ వినియోగించని ప్రభావం ప్రత్యక్షంగా రైతులకు కనిపించింది.



హైలెవల్ ఛానల్ కింద నీరు అందక ఎండిన వరి, నెర్రెలిచ్చిన నేల

ఓ అండ్ ఎం నిధులూ మింగేసి..

డెల్టా కాల్వలకు ప్రత్యేకంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసేదేలేదు. ఈ ఐదేళ్ల లో ఒక్క రూపాయి కూడా సాగునీటి కాల్వల మరమ్మతుల కోసమని ఖర్చు చేసిందిలేదు. ఏయేడాదికాయేడాది నీటి పారుదల శాఖ అధికారులు కాల్వల అత్య వసర మరమ్మతులు, కట్టలు బలపరచటం, వంతెనలు, షట్టర్ల మరమ్మతుల వంటి వాటికోసం రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకు నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపటం, అవి బుట్టదాఖలవటంతో వారూ చేతులు దులుపుకుని ఓ అండ్ ఎం కింద వచ్చే నిధులతో పనులు చేయించేందుకు పరిమితమయ్యారు. ఇవి మాత్రం రైతులు కట్టే నీటి తీరువా ఆధారంగా ప్రభుత్వానికి జమయ్యే నిధుల నుంచి వాటాలు విడుదల చేయటమే కనుక వసూలైన నీటి తీరువా లక్ష్యంలో సగ భాగం కూడా మరమ్మతులకు కేటాయించిన పరిస్థితి లేదు. వీటికీ నీటిపారుదల శాఖ అధికారులు ప్రతి సంవత్సరం రూ.60 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు ప్రతిపాదనలు పంపితే వాటిలో పదిహేను, ఇరవై కోట్లు ఇచ్చి చేతులు దులుపుకోవటంకూడా ఒక పరిపాటిగా మారింది. ఇవి కూడా సరిగ్గా కాల్వలకు నీరు వదలటానికి వారం, పది రోజుల ముందు విడుదల చేస్తే, ఆ పనులనూ అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్ అవతారమెత్తి పనులు చేయకుండానే నిధులు దోచేసిన పరిస్థితులున్నాయి. వీటిపై రైతులు ఎక్కడైనా నిలదీస్తే వారిపై దాడులు చేసిన పరిస్థితీ ఉంది. గత ఖరీఫ్‌లో ఓ అండ్ ఎం కింద రూ.22 కోట్లు మంజూరైనా వాటితో కనీసం పూడిక కూడా తియ్యకపోవటంతో కొం దరు వైసీపీ అభిమానులుగా ఉండే రైతులు కూడా తామే ఖర్చులు పెట్టుకుని చేయించుకున్న పరిస్థితి ఉంది.

అసంపూర్తిగా కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్ పనులు

అటు కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్‌పైనా అప్పట్లో ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ కాల్వపైనా ఆధారపడి 1.2 లక్షల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. దీనిలో సగభాగం వరకే ఖరీఫ్, రబీ రెండు పంటలకు నీరందితే, మిగిలిన సగం ఒక్క పంటకే పరిమితం చేశారు. ఈ ఖరీఫ్‌లో అయితే ఆ ఒక్క పంటకు కూడా నీరందటం గగనమైపోయింది. మరోపక్క గుంటూరు జిల్లాలో హైలెవల్ ఛానల్ కింద సాగవుతున్న 26వేల ఎకరాల పరిస్థితి మరీ దారుణం. కాల్వలకు ప్రారంభంలోనే ఉన్నా నీరందదు. రెండు సంవత్సరాలు ఖరీఫ్ నీరందక ఎండిపోయిన వరి పంటను తగలబెట్టిన దారుణ పరిస్థితి కూడా ఉంది. దీనిని తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో గత ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చొరవ చూపించి హైలెవల్ ఛానల్ ఆధునికీకరణకు పూనుకున్నారు. ప్రధాన కాల్వకన్నా ఎత్తు ఉండటంతో నీటిని పంప్ చెయ్యటం కానీ, ప్రధాన కాల్వలో కనీసం 3వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఎప్పుడూ ఉండేలా చూడటం కానీ అవసరం. దీనిలో పంప్‌చేసి నీటిని పంపాలని పెదవడ్లపూడి దగ్గర మెయిన్ కెనాల్‌పై మోటార్‌లతో నీటిని హైలెవల్ ఛానల్‌కు మళ్లించేలా గత టీడీపీ కాలంలో పనులు చేయించారు. ఇంకా కేవలం 5 శాతం పనులు, అంటే తుది మెరుగులు మాత్రమే పూర్తిచేసి నీటిని పంపే అవకాశం ఉంది. అయితే జగన్ సర్కారు వచ్చి ఐదేళ్లవుతున్నా ఇప్పటి వరకు దీనిపై ఒక్కసారి కూడా దృష్టి పెట్టలేదంటే రైతులపై, సాగునీటి వినియోగంపై ఎంత శ్రద్ధ ఉందనేది అర్థమవుతుంది.

చేనేతను చక్కదిద్దుతాం

- అతిపెద్ద కేంద్రంగా మంగళగిరి అభివృద్ధి
- అందుబాటులోకి అప్‌గ్రేడ్ చేసిన మగ్గాలు
- ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి లోకేశ్ హామీ

మంగళగిరి, ఏప్రిల్ 23: పాలకుల నిర్లక్ష్యంతో చితికిపోయిన చేనేత రంగాన్ని చక్కదిద్ది రాష్ట్రంలోనే అతిపెద్ద చేనేతకేంద్రంగా మంగళగిరిని అభివృద్ధి చేస్తామని టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ తెలిపారు. కాలగతిలో మసకబారిన మంగళగిరి చేనేతకు మళ్లీ పునరుజ్జీవం పోసేందుకు ఇప్పటికే తన కార్యాచరణ ఆరంభమైందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన స్థానిక బైపాస్ రోడ్డులోని కొండపనేని టౌన్‌షిప్‌వాసులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేయిలోపుగా ఉన్న మగ్గాల సంఖ్యను త్వరలోనే ఐదు వేలకు తీసుకువెడతామన్నారు. అధునికీకరించిన మగ్గాలను నేతన్నలకు అందిస్తామన్నారు. చీరాల, ధర్మవరం వంటి ప్రాంతాల్లో నేతన్నలు మగ్గాలను అప్‌గ్రేడ్ చేసుకుని ప్రాభవాన్ని నిలబెట్టుకుంటూ రాగా మంగళగిరిలో అందుకు భిన్నంగా ఉందన్నారు. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు తాను మంగళగిరిలో వీవర్స్‌శాలను ప్రయోగాత్మకంగా అమల్లోకి తీసుకువచ్చానన్నారు. చేనేత మగ్గాలను ఆధునికీకరించడంతోపాటు సరికొత్త డిజైన్లలో నేతన్నలకు ఎప్పటికప్పుడు శిక్షణను ఇప్పిస్తూ అంతర్జాతీయ మార్కెట్‌లో మంగళగిరి బ్రాండ్‌కు ఇమేజ్‌ను పెంచేలా వీవర్స్‌శాల పనిచేస్తుందన్నారు.

పన్నులు మాత్రం పెంచారు..

మంగళగిరి మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చి పన్నులను ఇబ్బడిముబ్బడిగా పెంచారు తప్ప మౌలిక వసతులైతే పంచాయతీలకన్నా అధ్వానంగా ఉన్నాయని లోకేశ్ ధ్వజమెత్తారు. తాను శాసనసభ్యుడిగా ఎన్నికయ్యాక యూనిట్ బేస్డ్ అభివృద్ధికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. జోనల్‌వారీగా పెద్దపెద్ద పార్కులను ఏర్పాటు చేసి ఆహ్లాదానికి పెద్దపీట వేస్తామన్నారు. వచ్చే 20 ఏళ్లకు సరిపడా భూగర్భ డ్రైనేజి నిర్మాణంతోపాటు ఈటీటీ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసిన కృష్ణాజలాలను ఇంటింటికి పంపిణీ చేయిస్తామన్నారు. నియోజకవర్గమంతటా రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడంతోపాటు తాడిపత్రి మోడల్‌లో పారిశుధ్య రక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. మంగళగిరిలో ఎక్కువగా ఉన్న స్వర్ణకారుల సంక్షేమం కోసం గోల్డ్‌హబ్‌ను ఏర్పాటు చేసి డిజైన్, ప్రొడక్షన్, టెస్టింగ్ వంటి సౌకర్యాలతోపాటు ల్యాబ్ డైమండ్స్ తయారీని ప్రోత్సహిస్తామన్నారు. క్రిటికల్ ఇన్‌ఫ్రా, సోషల్ ఇన్‌ఫ్రాలను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం చేనేత ప్రముఖుడు జంజనం శ్రీనివాసరావు నివాసాన్ని సందర్శించి వారి కుటుంబసభ్యులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త అబద్దయ్య పాల్గొన్నారు.



బాపనయ్యనగర్‌లో లోకేశ్‌ను ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

రేపు గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

- గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

4లో..

జడ్పీ చైర్‌పర్సన్‌ను ఒంటరిని చేసిన వైసీపీ

- మీటింగ్‌కు వెళ్లొద్దంటూ జడ్పీటీసీలకు ముఖ్య నేత ఆదేశాలు
- ఓవర్ యాక్షన్ చేస్తే పదవులు పోతాయని హెచ్చరిక
- రావాలని ఉన్నా సమావేశానికి రాలేక పోయిన సభ్యులు
- జిల్లా పరిషత్‌లో రాజకీయ అలజడి

రివర్స్ టెండరింగ్ పేరుతో.. పనులకు ఆటంకం

- ఆధునికీకరణపై ఐదేళ్లుగా పట్టించుకోని ప్రభుత్వం
- ఇటీవల ప్రత్తిపాడులో చంద్రబాబు హామీపై రైతుల్లో విశ్వాసం

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఛానల్ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించే లక్ష్యంతో గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చి టెండర్లు కూడా పూర్తి చేసిన ఛానల్ ఆధునికీకరణ, పొడిగింపు ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం పక్కన పడేసింది. రివర్స్ టెండరింగ్ పేరుతో ఐదేళ్లు కాలయాపన చేసింది. జిల్లా సమీక్ష మండలి సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రాజెక్టు గురించి ప్రశ్నించినప్పుడు సరైన సమయంలో పనులు చేపడతామని ఇన్‌చార్జి మంత్రులు సెలవిచ్చారు. కడుపు మండి రైతులు రోడ్డెక్కి వంద రోజులకు పైగా ఆందోళనలు, ధర్నాలు నిర్వహించినా జగన్ ప్రభుత్వం దయ తలచలేదు. కంటితుడుపు చర్యగా ఛానల్ పొడిగింపు కోసం అవసరమైన భూమిని సేకరించేందుకు నోటిఫికేషన్లు విడుదల చేసి చేతులు దులుపుకొన్నది. అది కూడా జగన్‌కు సంబంధించిన రేత పత్రికకు భూసేకరణ నోటిఫికేషన్ల రూపంలో ఆర్థికంగా రూ.లక్షల్లో మేళ్లు చేసేందుకు ఈ చర్యలు చేపట్టింది.

తాగు, సాగునీటికి ఇబ్బందులు

గుంటూరు ఛానల్ కింద ప్రస్తుతానికి 27 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఇందులో 18,300 ఎకరాలు మాగాణి కాగా ఆరుతడి పంటలు 8,700 ఎకరాలున్నాయి. తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని, గుంటూరు తూర్పు, చేబ్రోలు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల్లోని భూములకు సాగునీరు అందుతున్నది. ప్రధానంగా రైతులు వరి, మిర్చి, పత్తి, అపరాలు సాగు చేస్తుంటారు. ఈ ఛానల్ డిజైన్ 600 క్యూసెక్కులు కాగా 300 క్యూసెక్కులకు మించి నీరు విడుదల చేయలేని పరిస్థితి గత కొన్నేళ్లుగా కొనసాగుతున్నది. ఇందుకు కారణం ఈ కాలువ తేలికపాటి నేలల్లో ఉండటం వల్ల కట్టలు బలహీనపడిపోయాయి. దీంతో 50 శాతం వరకు తగ్గించి నీటిని విడుదల చేస్తున్నారు. ఏటా 4 టీఎంసీల నీరు ఈ ఛానల్ ద్వారా విడుదల అవుతుంది. దీనిపై ఆధారపడి గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, ఇతర 38 తాగు నీటి చెరువులున్నాయి. కాగా పెదనందిపాడు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు, తాగు నీరు అందక ప్రజలు అల్లాడుతున్నారు.

టీడీపీ టెండర్లు.. వైసీపీ నిలిపివేత

తాగు, సాగునీటి అవసరాల కోసం ఈ ఛానల్ పొడిగింపుని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించారు. అప్పట్లోనే పరిపాలను అనుమతులు మంజూరు చేసి టెండర్లు కూడా నిర్వహించారు. ఛానల్ ఆధునికీకరణ జరిగితేనే పొడిగింపు చేపట్టవచ్చు. ఈ దృష్ట్యా రూ.652.78 కోట్లతో గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ పనులను టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. మరికొద్ది రోజుల్లో పనులు ప్రారంభమౌతాయనుకొంటున్న సమయంలో 2019లో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో వైసీపీ గెలుపొంది అధికారం చేపడుతూనే రివర్స్ టెండరింగ్ పేరుతో అవార్డు అయిన కాంట్రాక్టులను కూడా నిలిపేసింది. అది మొదలు నేటివరకు ఫైళ్లలోనే ఈ రెండు ప్రాజెక్టులు కదులుతున్నాయి తప్ప క్షేత్ర స్థాయిలో ఏమీ జరగలేదు. ఛానల్ పొడిగింపు కోసం దాదాపుగా 389.81 ఎకరాల భూమిని రైతుల వద్ద సేకరించాలి. ఇందు కోసం కనీసం రూ.110 కోట్ల వరకు నిధులు అవసరమౌతాయని అంచనా వేశారు. ఆ మొత్తం కూడా వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో విడుదల చేయలేకపోయింది. ప్రభుత్వం తీరు మారకపోవడంతో పెదనందిపాడు రైతులు అనేక మార్లు కలెక్టరేట్ ఎదుట ధర్నాలు, పెదనందిపాడు బంద్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఛలో గుంటూరు కార్యక్రమానికి పిలుపునివ్వగా పోలీసులతో వారిని వైసీపీ ప్రభుత్వం అడ్డుకున్నది. గత ఏడాది ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో పాటు మరికొంతమంది ఎమ్మెల్యేలు గుంటూరు ఛానల్ పొడిగింపు గురించి జిల్లా సమీక్ష మండలి సమావేశంలో ప్రస్తావించగా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు కంటితుడుపు చర్యగా సరైన సమయంలో పనులు మొదలు పెడతామని సమాధానం దాటేశారు. కాగా ఇటీవలే ప్రత్తిపాడులో పర్యటించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి రాగానే గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. దీంతో రైతులు ఆయన మాటలను విశ్వసిస్తున్నారు.

వైసీపీ దొంగల పార్టీ

- అప్పుల ఊబిలోకి ఆంధ్రప్రదేశ్
- ప్రజల చేతికి చిప్ప ఇచ్చిన సీఎం జగన్
- కర్లపాలెం, తెనాలిలో షర్మిల న్యాయయాత్ర

తెనాలి, కర్లపాలెం, ఏప్రిల్ 23: వైసీపీ దొంగల పార్టీ. దోపిడీ రాజ్యం. రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టి ప్రజల చేతికి ముఖ్యమంత్రి జగన్ చిప్ప ఇచ్చారు. రాష్ట్రంలో మిగిలి ఉన్న ప్రజాధనాన్ని, ప్రజల ఆస్తులను కొల్లగొట్టడానికి జగన్మోహనరెడ్డి సిద్ధం సిద్ధమంటూ పిలుపిస్తున్నారు. ప్రజలందరూ ఈ వాస్తవాన్ని గ్రహించాలి.. అని పీసీసీ చీఫ్ షర్మిల తెలిపారు. తెనాలి, బాపట్ల నియోజకవర్గాల్లో మంగళ వారం షర్మిల ఏపీ న్యాయ యాత్ర జరిగింది.

రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు జగన్ తూట్లు

చెప్పినమాట నిలబెట్టుకోవడమే కాక, మడమతిప్పని మాటతప్పని మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అయితే జగన్మోహనరెడ్డి దీనికి పూర్తి భిన్నమని కర్ల పాలెంలో జరిగిన సభలో షర్మిల సీఎంపై ధ్వజ మెత్తారు. రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారన్నారు. రాజశేఖర్‌రెడ్డి బీజేపీని పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తే జగన్ సాగిలపడుతున్నారన్నారు. వరద ముంపు సమయంలో బాపట్ల వచ్చిన జగన్ నల్లమడను ఆధునికీకరిస్తానని చెప్పి పట్టించుకోలేదన్నారు.

జగన్ కన్నా కుంభకర్ణుడు నయం

కుంభ కర్ణుడు ఆరు నెలలు నిద్రపోయి, ఆరు నెలలు పనిచేస్తాడంటారు కానీ జగన్ ఐదేళ్లూ నిద్రపోతూనే ఉన్నాడని షర్మిల తెనాలిలో జరిగిన సభలో ధ్వజమెత్తారు. ఐదేళ్లు పడుకుని ఎన్నికలొచ్చాయని మళ్లీ సిద్ధమంటూ ఊరేగడానికి బయటకొచ్చావా అంటూ ఎద్దేవా చేశారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. జగన్‌రెడ్డి అరాచకాలను ప్రశ్నించడానికి తాను వచ్చానన్నారు. సంక్రాంతి వచ్చినప్పుడల్లా జాబ్ క్యాలెండర్ వస్తుందని జగన్ హామీ ఇచ్చాడని ఐదు సంక్రాంతులు వచ్చి వెళ్లినా ఒక జాబ్ క్యాలెండర్ కూడా రాలేదేమని ప్రశ్నించారు. ఆనాడు చంద్రబాబు డీఎస్సీ ప్రకటిస్తే 23 వేల పోస్టులకు 7 వేలే ప్రకటిస్తారా అని ఎద్దేవా చేసిన జగన్ ఇప్పటి వరకు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా గుడ్డి గుర్రానికి పళ్లు తోముతున్నారా అని ప్రశ్నించారు. వైఎస్ రైతులను నెత్తిన పెట్టుకున్నాడని, కానీ జగన్ కనీసం డ్రిప్పుకు కూడా సబ్సిడీ ఇవ్వలేదని మండిపడ్డారు. సొంత కుటుంబానికే న్యాయం చేయలేనోడు జనానికి ఏం చేస్తాడో కూడా జనం ఆలోచించాలని కోరారు. ఒక రాజధాని సమకూర్చలేని జగన్ మూడు రాజధానులని చెప్పి ఒక్కచోటయినా పిడికెడు మట్టిపోశాడా అని మండిపడ్డారు. చివరకు రాజధాని లేని రాష్ట్రంగా మార్చారని, తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని హామీ ఇచ్చారు.



తెనాలి సభలో మాట్లాడుతున్న షర్మిల



సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, వేదికపై గల్లా మాదవి తదతరులు

ఏపీని గంజాయి హబ్‌గా మార్చారు

● గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి హబ్‌గా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం గుంటురు నగరంలోని వికాస్‌నగర్ సమీపంలోని అపార్ట్‌మెంట్ వాసులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ పెమ్మసానితోపాటు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గల్లా మాధవి హాజరయ్యారు. పెమ్మసాని మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో సాధారణ ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులు సైతం లక్షల జీతం ఆర్జిస్తుంటే, జగన్‌పాలనలో విద్యార్థులంతా గంజాయి, పిచ్చి మద్యానికి బానిసలుగా మారి సమాజానికి, తల్లిదండ్రులకు భారంగా మారారని ఆవేదన వ్యక్తంచేశారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది ప్రజాసేవ చేయటానికి మాత్రమేనని అవినీతి, అరాచకాలు అనే పదాలకు అర్థం కూడా తెలియదని అన్నారు. గత ఎన్నికల్లో జగన్ ఏటేటా జాబ్ క్యాలెండర్, సీపీఎస్ రద్దు, మద్యపాన నిషేధం, ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం తదితర హామీలతో ప్రజలను నమ్మించి వంచించారని, చంద్రబాబు అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు డీఎస్సీతో పాటు తదితర నోటిఫికేషన్ల దస్త్రంపై మొదటి సంతకం చేస్తానని ఇచ్చిన హామీని గుర్తుచేశారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గల్లా మాధవి మాట్లాడుతూ మంత్రి హోదాలో ఉన్న రజిని తనసొంత నియోజకవర్గం చిలకలూరిపేటలో పోటీచేసే ధైర్యంలేక గుంటూరు పశ్చిమానికి పారిపోయి వచ్చిందన్నారు. కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ హవా వీస్తున్నప్పుడే గుంటూరు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకున్న టీడీపీకి, అవినీతి అనకొండలైన రజిని, రోశయ్యలను తరిమి కొట్టడం ఒక లెక్క కాదన్నారు. సమావేశంలో జనసేన ముఖ్య నేతలు బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు డేగల ప్రభాకర్, గల్లా రామచంద్రరావు, కొమ్మినేని ప్రసాద్, సింహాద్రి కనకాచారి, పిల్లి మాణిక్యరావు, యాగంటి దుర్గారావు, కొమ్మినేని కోటేశ్వరరావు, మద్దిరాల మ్యానీ, ఎలుకా వీరాంజనేయులు, లంకా ఉదయ్, వేములపల్లి శ్రీరామ ప్రసాద్, పోతురాజు సమత, నూకవరపు బాలాజి తదితరులు పాల్గొన్నారు.

నగదు, చీరలు సీజ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 23: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో మంగళగిరి నియోజకవర్గంలో రూ.70,930 నగదు, పొన్నూరు నియోజకవర్గంలో రూ.4,20,335 విలువకలిగిన 460 చీరలు, 460 ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో ఏప్రిల్ 23 సాయంత్రం 6గంటల వరకు రూ 2,36,20,465 ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

నాయి బ్రాహ్మణులను ఆదుకుంటాం

● దేవస్థానం ధర్మకర్తలుగా అవకాశం
● మునిసిపల్ కాంప్లెక్సుల్లో దుకాణాలు కేటాయిస్తాం
● ఆదరణ పథకం పునరుద్ధరణకు చర్యలు
● నాడు, నేడు బీసీలకు అండ టీడీపీనే
● నాయి బ్రాహ్మణులతో భేటీలో నారా లోకేశ్



లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయిబ్రాహ్మణులు

మంగళగిరిసిటీ, ఏప్రిల్ 23: ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాయిబ్రాహ్మణులను అన్నివిధాలా ఆదుకుంటామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎన్డీఏ కూటమి అభ్యర్థి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో మంగళవారం నాయిబ్రాహ్మణులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ వృత్తిరీత్యా నాయిబ్రాహ్మణులు అహర్నిశలు కష్టపడుతుంటారని చెప్పారు. వారికష్టాన్నిచూసి మంగళగిరి నియోజకవర్గంలో నాయిబ్రాహ్మణ వృత్తిదారులకు 122 సెలూన్ షాపులకు కుర్చీలు అందజేశామని తెలిపారు. పేదరికంలేని మంగళగిరిని స్థాపించాలన్న లక్ష్యంతో అధికారంలో లేకపోయినప్పటికీ సొంత ఖర్చులతో 29 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశానని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాల పాలక మండళ్లలో నాయిబ్రాహ్మణులకు ధర్మకర్తలుగా అవకాశం కల్పిస్తామని, మునిసిపల్ కాంప్లెక్సుల్లో కొన్నిషాపులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. దేవాలయాల్లో క్షురకులుగా నాయిబ్రాహ్మణులను మాత్రమే నియమించే విధంగా గత జీవోలను పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. బీసీలకు నాడు-నేడు పెద్దపీట వేసింది తెలుగుదేశం మాత్రమేనన్నారు. జయహో బీసీ కార్యక్రమం ద్వారా ఇప్పటికే బీసీ డిక్లరేషన్ ప్రకటించామన్నారు. బీసీలకు 50ఏళ్లకే పింఛన్ అందిస్తామని, ఆదరణ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టి ఏటా రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించారు. బీసీ కార్పొరేషన్లను బలోపేతం చేసి బీసీ వర్గాలకు ఆర్థిక చేయూతనందిస్తామని లోకేశ్ తెలిపారు.



నాయిబ్రాహ్మణులతో మాట్లాడుతున్న నారా లోకేశ్

సమస్యలపై నాయిబ్రాహ్మణుల వినతి

నాయిబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. దేవాలయాల్లోని కేశఖండనశాలల్లో ఉపాధి కల్పించాలని, దేవాలయకమిటీల్లో సభ్యులుగా అవకాశం ఇవ్వాలని, కార్పొరేట్ సెలూన్ల రంగప్రవేశంతో ఉపాధి దెబ్బతిందని, తమకు తక్కువ అద్దెతో మునిసిపల్ కాంప్లెక్సుల్లో షాపులు కేటాయించాలని, అమరావతిలోనాయిబ్రాహ్మణుల ఆరాధ్య దైవం ధన్వంతరి వైద్య నారాయణస్వామి దేవాలయం నిర్మించాలని, కమ్యూనిటీ హాళ్లను నిర్మించాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించాలని, దేవాలయాల్లోని కేశఖండన శాలల్లో పనిచేస్తున్న నాయిబ్రాహ్మణులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సెలూన్ షాపులకు రూ.200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకాన్ని సక్రమంగా అమలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లోకేశ్ స్పందిస్తూ దామాషా ప్రకారం కమ్యూనిటీ హాళ్ల నిర్మిస్తామని, నాయి బ్రాహ్మణ వృత్తిదారులు కార్పొరేట్ పోటీని తట్టుకునే విధంగా అధునాతన శిక్షణకు చర్యలు తీసుకుంటామని, విదేశీ విద్య పథకాన్ని గతంలో మాదిరిగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

జడ్పీ చైర్‌పర్సన్‌ను ఒంటరిని చేసిన వైసీపీ

● మీటింగ్‌కు వెళ్లొద్దంటూ జడ్పీటీసీలకు ముఖ్య నేత ఆదేశాలు
● ఓవర్ యాక్షన్ చేస్తే పదవులు పోతాయని హెచ్చరిక
● రావాలని ఉన్నా సమావేశానికి రాలేక పోయిన సభ్యులు
● జిల్లా పరిషత్‌లో రాజకీయ అలజడి



కోరం లేకపోవడంతో సమావేశం వాయిదా వేసి వెళ్లిపోతున్న జడ్పీ చైర్‌పర్సన్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 23: గుంటూరు జిల్లా పరిషత్ రాజకీయ ముఖ చిత్రం మారిపోయింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనాపై అధికార వైసీపీ కత్తి కట్టింది. జడ్పీ చైర్ పర్సన్, ఆమె భర్త ఎన్నో ఏళ్ళ పాటు ఆ పార్టీకి విధేయులుగా వున్నప్పటికీ ఏకకాలంలో ఒంటరిని చేసింది. మంగళవారం జిల్లా పరిషత్‌లో జరిగిన సంఘటనలు ఈ మాటలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. మూడు నెలల కాల వ్యవధి ముగియడంతో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సమావేశం నిర్వహణపై జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుని మరీ నిర్వహించారు. ఉదయం స్థాయి సంఘాల సమావేశాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాధారణ సమావేశం జరుగుతుందని సభ్యులకు సమాచారం అందించారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్పీటీసీలతో కలిపి మొత్తం 86 మంది సభ్యులు సమావేశానికి హాజరు కావాల్సి ఉంది. అయితే స్థాయి సంఘాల చైర్మన్ హోదాలో క్రిస్టీనా సమావేశం నిర్వహించినప్పటికీ సభ్యులు గా ఉన్న జడ్పీటీసీలు ఎవరూ హాజరు కాలేదు. సభ్యులు వస్తారేమో అని చైర్ పర్సన్ చాలా సేపు ఎదురు చూసినప్పటికీ ఎవరూ రాకపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మధ్యాహ్నం 2గంటలకు సాధారణ సమావేశం ప్రారంభం అయ్యాక కేవలం ఆరుగురు జడ్పీటీసీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి చైర్‌పర్సన్ ఛాంబర్‌కు వెళ్లిపోయారు.

తెర వెనుక చాలా జరిగింది...

ప్రస్తుత ఎన్నికల్లో సీటు ఇస్తామని ఆశచూపించి ముఖ్యమంత్రి జగన్‌హన్‌రెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ దంపతులకు మొండిచేయి చూపించారు. వేమూరు, తాడికొండ నియోజకవర్గాల్లో కత్తెర సురేష్ చాలా సంవత్సరాలు ఎంతో ఖర్చు చేసి పార్టీ కోసం కష్టపడ్డారు. అక్కడ వేరే వారికి సీటు కేటాయిస్తూ జగన్ చైర్ పర్సన్ దంపతులను పిలిపించి మాట్లాడారు. యర్రగొండపాలెం సీటు ఇస్తామని హామీ ఇచ్చి పంపారు. ఆ సీటుకూడా వేరే వారికి ఇవ్వటంతో చైర్ పర్సన్ దంపతులు చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. అప్పటి నుంచి వైసీపీ అధిష్టానం గుర్రుగా ఉంది. ఇంతలో జిల్లా పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించాల్సి రావడంతో జిల్లా వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. సమావేశానికి రావద్దంటూ జడ్పీటీసీలను ఆదేశించారు. వస్తేపదవులు పోతాయంటూ బెదిరించినట్లు తెలుస్తోంది. ముఖ్యనేతల ఆదేశాలతో జడ్పీటీసీలు జిల్లా పరిషత్‌కు వచ్చేందుకు సాహసించలేదు. వచ్చిన కొద్దిమంది భోజనాలు విషయంలో వివాదం రేపేందుకు ప్రయత్నించటంతో అప్రమత్తమైన జడ్పీ డిప్యూటీ సీఈవో వారిని శాంతిపచేశారు.

జడ్పీ చైర్ పర్సన్‌పై రాజకీయ కుట్ర ?

పంచాయతీరాజ్ చట్ట ప్రకారం జడ్పీ చైర్‌పర్సన్‌పై ఇప్పుడప్పుడే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం లేదు. అప్పటి వరకు ఆమె అధికారాలకు కత్తెర వేయాలన్న ఆలోచనలో వైసీపీ ముఖ్య నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సాధారణ సమావేశం బహిష్కరింప చేసినట్లు అర్థం అవుతుంది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జడ్పీ పాలన వ్యవహారంపై దృష్టి సారించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అప్పటి వరకు చైర్‌పర్సన్ ప్రతి కదలిక పైన నిఘా ఉంచాలని తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

గుర్రుగా ఉన్న అనుకూల వర్గం..

జిల్లా పరిషత్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని చూసి చైర్‌పర్సన్ అనుకూల వర్గం వైసిపి నేతల తీరుపై గుర్రు గా వున్నారు. ఇన్ని సంవత్సరాలు అనుకూలంగా ఉన్నప్పటికీ వెంటనే ఒంటరి ని చేసే ప్రయత్నం చెయ్యటం పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొందరు జడ్పీటీసీలు, ఉద్యోగులు కూడా చైర్ పర్సన్ అండగా నిలిచేందుకు సిద్ధమయ్యారు.

నలుగురు ఉద్యోగులపై చర్యలు

● పది కేసుల నమోదు ● చిలకలూరిపేట ఆర్వో వెల్లడి



ఆర్వో నారదముని

చిలకలూరిపేట, ఏప్రిల్ 23: చిలకలూరిపేట అసెంబ్లీనియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు నలుగురు ఉద్యోగుల పై చర్యలు తీసుకున్నట్టు చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.నారదముని మంగళవారం చెప్పారు. వీరంతా ఎన్నికల సంఘం నిబంధనలను పాటించని కారణంగా ఈమేరకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ నలుగురిలో ఒక ఆర్పీ, ఒక వీఆర్‌ఏను సస్పెండ్ చేసినట్టు వెల్లడించారు. ఒక అసిస్టెంట్ బిల్ కలెక్టర్, నాన్ పబ్లిక్ హెల్త్ ఉద్యోగి, వాటర్ సప్లయ్ విభాగం ఉద్యోగిని విధుల నుంచి తప్పించినట్టుగా ఆయన వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించని కారణంగా ఇప్పటి వరకు పది కేసులు నమోదు చేసినట్టు ఆయన వివరించారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఇప్పటి వరకు 435 పర్మిషన్‌లను ఆయా పార్టీల వారు అడిగారని, ఇందులో 401 పర్మిషన్‌లు ఇచ్చామని తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు నియోజకవర్గపరిధిలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 264.82 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, సరైన పత్రాలు లేకుండా తీసుకు వెళ్తున్న రూ 35.08 లక్షల నగదును సీజ్ చేశామన్నారు. నియోజక వర్గ ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు మొత్తం తొమ్మిది నామినేషన్‌లు దాఖలయ్యాయని తెలిపారు. ఇప్పటికే ఒక విడత శిక్షణా తరగతులు పీవోలు, ఏపీవోలకు నిర్వహించామని తెలిపారు. మైక్రో అబ్జర్వర్లకు కూడా శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనల ప్రకారం వ్యవహరించాలని ఆయన కోరారు.



టీడీపీ కార్యకర్తలపై కర్రతో దాడి చేస్తున్న వైసీపీ మూక

టీడీపీ కార్యకర్తలపై దాడి

పొన్నూరుటౌన్, ఏప్రిల్23: పొన్నూరు పట్టణంలో మంగళవారం టీడీపీ కార్యకర్తలపై నాయకులు దాడికి దిగిన ఘటన చోటుచేసుకుంది. మంగళవారం వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ నామినేషన్ దాఖలుకు వైసీపీ కార్యకర్తలు నాయకులు పట్టణంలోకి వచ్చారు. అయితే ఆ సమయంలో మామిళ్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ అభిమాని మరో ఇద్దరు రెండు వాహనాలపై టీడీపీ జెండాలను తీసుకువెళతున్నారు. ఆ సమయంలో ఆ కార్యకర్తలను అడ్డుకున్న వైసీపీ శ్రేణులు విచక్షణ రహితంగా కర్రలతో దాడి చేసి దార్ల రవి కిరణ్‌ను తీవ్రంగా కొట్టారు. 24వ తేదీన జరిగే నామినేషన్ దాఖలు కార్యక్రమానికి జెండాలు తీసుకువెళతునామని ప్రదర్శించలేదని చెప్పినప్పటికి వినకుండా తీవ్రంగా దాడి చేయటమే కాకుండా దుర్భాషలాడుతూ వైసీపీ శ్రేణులు కొట్టి గాయపరిచారని రవి కిరణ్ వాపోయాడు. ఈ ఘటనపై అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రవికిరణ్ వెల్లడించారు. గాయపడిన రవి కిరణ్‌ను ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఫోన్‌లో పరామర్శించి సంఘటన జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద వెండిసీజ్

తెనాలిరూరల్, ఏప్రిల్23: మండలంలోని నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద బిల్లులు లేకుండా ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న వెండిని సీజ్ చేసినట్టు రూరల్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన షేక్ సుల్తాన్ అనే వ్యక్తి విజయవాడ నుండి తెనాలికి బస్సులో మంగళవారం సుమారు 3 కేజీల 410 గ్రాముల వెండితో వస్తున్నాడు. మార్గ మధ్యమైన నందివెలుగు చెక్‌పోస్ట్ వద్ద ప్రత్యేక బృందాలు బస్సులో తనిఖీలు నిర్వహించగా ఎటువంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న వెండిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుడి కాలువను పరిశీలించిన కేఆర్‌ఎంబీ సభ్యులు

విజయపురిసౌత్, ఏప్రిల్ 23: కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) సభ్యుడు డీఈ అజయ్‌యాదవ్ మంగళవారం నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ పరిధిలోని కుడికాలువను పరిశీలించారు. ముందుగా కుడికాలువ వద్ద అమర్చిన టెలీమీటర్‌ను, కాలువ ద్వారా విడుదలవుతున్న నీటి ప్రవాహాన్ని అంచనా వేశారు. అనంతరం ఇరిగేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కేఆర్‌ఎంబీ జేఈ రాజేష్‌చారి, డీఈలు మురళీధర్, లింగమూర్తి, జేఈ బాబుమియా, ఏఈ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానులు తుగ్లక్ పాలనకు నిదర్శనం

● 1589వ రోజుకు చేరుకున్న ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

తుళ్లూరు, ఏప్రిల్23: రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసి చరిత్ర హీనులుగా వైసీపీ పాలకులు మిగిలిపోయారని 33 వేల ఎకరాల భూములను ఇచ్చిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అని రైతులు, మహిళలు, రైతుకూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1589వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, ఉన్న రాజధానిని నాశనం చేస్తూ మూడు రాజధానులు పెడతాను అని జగన్‌రెడ్డి అనటం తుగ్లక్ పాలనకు నిదర్శనమన్నారు. వైసీపీని ఇంటికి పంపటమే ధ్యేయంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలుగు కార్యక్ర మం కొనసాగింది. బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి.

84,371 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 75,351 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 84,371 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 51,569 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17500
నెంబరు. 5	9500	12000
273	10500	13800
341	8000	17000
4884	9000	13000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	16000
దేవనూరు డీలక్స్	8500	13000
తెల్లకాయలు	4500	11500



అమరావతిలో భాష్యం ప్రవీణ్‌తో కలసి మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

వైసీపీకి ఓటెందుకు వెయ్యాలో నిలదీయండి

● మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

అమరావతి, ఏప్రిల్ 23: ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి రాజధాని లేని రాష్ట్రంగా చేసిన వైసీపీ నాయకులు మరోసారి ఓటు వేయాలని ఇంటికి వస్తే మీకు ఓటు ఎందుకు వేయాలని ప్రజలు నిలదీయాలని మాజీ మంత్రి మరియు సత్తెనపల్లి నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు.మంగళవారం పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌తో కలసి మండలంలోని అమరావతి, లింగాపురం, మల్లాది గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఇసుక, మద్యం, గ్రావెల్, గ్రానైట్ అక్రమ తవ్వకాల ద్వారా కోట్లాది రూపాయలు దోచుకున్నాడని, సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.1000 వివిధ పన్నుల రూపంలో లాక్కున్నాడని అన్నారు. రాజధానిని నిర్మించలేని, పోలవరాన్ని పూర్తి చేయలేని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేని ఈ ప్రభుత్వానికి ప్రజలు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ గతంలో 20 ఏళ్ల కన్నా లక్ష్మీనారాయణను ఆదరించారని, అనంతరం కొమ్మాలపాటి శ్రీధర్‌ను ఆదరించారని అదేవిధంగా తనను ఆశీర్వదించి ఆదరించాలని కోరారు. పెదకూరపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమాల్లో మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

రేపు గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

● గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 25న జరగనున్న ఏపీఆర్‌జేసీ, డీసీసెట్ -2024, ఏపీఆర్‌ఎస్ క్యాట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ఆర్. నరసింహారావు వెల్లడించారు. మంగళవారం గుంటూరు కొరిటెపాడులోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50 గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న ఏపీఆర్‌ఎస్ క్యాట్-2024కు 32,666 మంది విద్యార్థులకు 145 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా 10 జూనియర్ కళాశాలలతో పాటు ఒక డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి గురువారం మధ్యాహ్నం 2.30 నుంచి 5.00 గంటల వరకు జరగనున్న ఏపీఆర్జేసీ డీసీసెట్ -2024కు 56,949 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకోసం 254 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. డిగ్రీలో ప్రవేశానికి 1,209మంది డీసీసెట్‌కు హాజరవుతున్నారన్నారు. 26 జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, పరీక్షల నిర్వహణను ఆయా జిల్లాల్లో ఏపీఆర్‌ఈఐఎస్ ద్వారా నియమించిన కో-ఆర్డినేటర్లు, డీఈవోలు పర్యవేక్షిస్తారని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రానికి డీఈవోలచే చీఫ్ సూపరింటెండెంట్, తమ సంస్థ ద్వారా శాఖాధికారులను నియమించామన్నారు. సంస్థ వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులు కనీసం గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.



విద్యార్థులతో డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

'పది' ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ ప్రభంజనం


గుంటూరు(విద్య), ఏప్రిల్23: 10వతరగతి ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు అఖండ విజయాన్ని సాధించారని సంస్థల చైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు 592 సాధించారని తెలిపారు. అదేవిధంగా 580 పైన 35 మంది. 570 పైన 96మంది, 560 పైన 155మంది, 550పైన 243 మంది, 540పైన 314 మంది, 530పైన 386 మంది, 520 పైన 450మంది. 510పైన 18మంది, 500 లోపు 600 మంది విద్యార్థులు విజయం సాధించారు. అదేవిధంగా మ్యాథ్స్‌లో 91 మందికి 100 మార్కులు, 225 మందికి 95 పైన మార్కులు వచ్చాయని వెల్లడించారు. తెలుగులో 32 మందికి 100 మార్కులపైన, 331 మందికి 95 మార్కులు సాధించారని వివరించారు. ఇంకా సోషల్ 24 మందికి 100 మార్కులు, 296 మందికి 95 పైన మార్కులు, సైన్స్‌లో 17 మందికి 100 మార్కులు 155 మందికి 95 పైగా మార్కులు, హిందీ 9 నుందికి 100 పైన 87మందికి 95 పైన మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను చైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఆరోన్‌రెడ్డి, డైరెక్టర్స్ విజయభాస్కర్ రెడ్డి, జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం తదితరులు అభినందించారు.

మన వాళ్లయితే ఓకే..!

● పులిచింతల పునరావాసపట్టాల రిజిస్ట్రేషన్‌లో అధికారుల పక్షపాతం
● నెలన్నర అవుతున్నా చేతికందని పత్రాలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 23: పులిచింతల పునరావాస కేంద్రాల నిర్వాసితుల పట్టాలను ఉచితం ఉచితం అంటూనే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొందరు అధికార పార్టీ నేతలు సిండికేట్‌గా తయారై ప్రతి లబ్ధిదారుడి వద్ద నుంచి సుమారు 3 వేల రూపాయలకు పైగా వసూలు చేశారు. మామూళ్ల వ్యవహారం కలెక్టర్ కార్యాలయానికి చేరడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను రెవెన్యూ కార్యాలయంలో పూర్తిచేసుకొని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సమర్పించాల్సి వుంది. అలా చేసినా వసూళ్ల మాత్రం ఆగలేదు సరికదా..ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అధికార పార్టీ నేతలు కొత్త ఎత్తుగడకు సిద్ధమయ్యారు. న్యూ వెల్లంపల్లి పునరావాస కేంద్రానికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌లు మార్చి నెల 4, 5 తేదీల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల ప్రక్రియ పూర్తయినా పులిచింతల స్పెషల్ కలెక్టర్, ప్రత్యేక అధికారుల బయోమెట్రిక్ వేసిన తరువాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్లు చూపారు. అలా దస్తావేజులను పూర్తిచేయడంలో కొందరు రెవెన్యూ అధికారులు వైసీపీ నాయకులు ఒకటయ్యారు. మనవాళ్లైతే ఓకే.. కాకుంటే చూద్దాం అంటూ దస్తావేజులన్నీ పక్కన పెట్టారు. న్యూవెల్లంపల్లి పునరావాస కేంద్రంలో వైసీపీ నేతలు చెప్పిన వారి దరఖాస్తులను రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి పత్రాలను లబ్ధిదారులకు నాలుగు రోజులు అటో ఇటో ఇచ్చేశారు. టీడీపీ సానుభూతిపరులకు చెందిన కొన్ని రిజిస్ట్రేషన్ పత్రాలపై ఇంకా అధికారుల సంతకాలు పెట్టకపోవడం వెనుక నేతల ఒత్తిడి కారణమని, ఇప్పటికీ నెలన్నర అవుతున్నా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి దస్తావేజులను ఇవ్వకుండా ఎన్నికల డ్రామా ఆడటం పట్ల నిర్వాసితులు మండిపడుతున్నారు. దీని వెనుక నేతల ఒత్తిడి కారణమని, ఒకటి రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి దస్తావేజులను వెంటనే ఇవ్వకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపేందుకు నిర్వాసితులు సంసిద్ధంగా వున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



లావణ్య (ఫైల్)

పెదకాకాని, ఏప్రిల్ 23: గుర్తుతెలియని మహిళ మృతి చెంది నట్లు మంగళవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 14న గుంటూరు- పెదకాకాని హైవేపై గుర్తు లేని మహిళపడి ఉంది. 108 అంబులెన్స్‌లో గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా ఆమె పేరు లావణ్య అని మాత్రమే చెప్పిందని పోలీసులు తెలిపారు. మతి స్థిమితం లేని ఆ మహిళ ఈనెల 17న మృతి చెందినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు పెదకాకాని పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో 8688831350 తెలియపరచాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



బాలాజీ నగర్‌లో కరపత్రాలను అందజేస్తున్న నసీర్, సుభానీ తదితరులు

పాత గుంటూరును పట్టించుకోని ఎమ్మెల్యే ముస్తఫా

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మొహమ్మద్ నసీర్

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పాతగుంటూరును తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా ఏమాత్రం పట్టించుకోలేదని, పూర్తిగా నిర్లక్ష్యం చేశాడని తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చేపట్టిన ప్రజాదీవెన యాత్ర 8వ రోజు మూడో డివిజన్ బాలాజీ నగర్‌లో విజయవంతంగా సాగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ అధికారంలో ఉండి కూడా తూర్పు నియోజకవర్గం అభివృద్ధిని ఎమ్మెల్యే ముస్తఫా విస్మరించాడని మండిపడ్డారు. ఎమ్మెల్యే ముస్తఫా ఓడిపో తాడనే అయన కుమార్తెను ఎన్నికల్లో నిలబెట్టాడని విమర్శించారు. రానున్న ఎన్ని కల్లో కూటమి ప్రభుత్వం వస్తే గుంటూరును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామ ని తెలిపారు. అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక స్వావలంబన చేకూరుస్తుందన్నారు. పాత గుంటూరు శివారు ప్రాంతలను అభి వృద్ధి చేయటానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, టీడీపీ 3వ డివిజన్ నాయకులు అల్లం బాజీ, బట్టా రాజా, జనసేన నాయకులు మాదాసు శేఖర్, జడ సురేష్, బీజేపీ నాయకుడు రామకృష్ణ, యస్వంత్, స్థానిక నాయకుడు ఐల శ్రీను పాల్గొన్నారు.

తెలుగుదేశంతోనే బీసీలకు సమన్యాయం

బీసీలకు ఉత్తుత్తి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీలకు ఏదో చేశామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు సమన్యాయం జరగలేదని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మొహమ్మద్ నసీర్ చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఆయన గోడపత్రిక ఆవిష్కరించారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నసీర్ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు మొట్టమొదటిసారిగా టీడీపీనే ఫెడరేషన్ ఏర్పాటు చేసిందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నాయీబ్రాహ్మణులకు, వృత్తి వ్యాపారులకు సెక్యూరిటీ లేని రుణాలు రూ.5 లక్షల వరకు అందజేస్తామని, సెలూన్ వృత్తిదారులకు పంచాయతీ, నగర కార్పొరేషన్ లోని దుకాణ సముదాయాల్లో షాపులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బార్బర్ పోస్టులు భర్తీ చేస్తామని, నాయీబ్రాహ్మణ విద్యార్థులకు నైపుణ్యం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారని, వాటన్నింటిపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ నాయకులు మునగాటి రాజారావు, మల్లాది నాగరాజు, రోజ్ కుమార్, రవి, చిన్న కోటేశ్వరరావు, కృష్ణ, కిరణ్, శివకుమార్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మొహమ్మద్ నసీర్

విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనాలు కరువు: నసీర్

విశ్రాంత ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి ప్రయోజనాలు అందజేయటం లేదని, పెన్షనర్లను కూడా ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. యాదవ బజారులో కొందరు విశ్రాంత ఉద్యోగులు 50 మంది మంగళవారం టీడీపీలో చేరారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రంగారావు, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

అక్షర జ్ఞానం ద్వారానే అభివృద్ధి సాధ్యం



పుస్తకశాలను ప్రారంభిస్తున్న మస్తానయ్య తదితరులు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23 : ఆటవిక యుగం నుంచి అక్షర జ్ఞానంతోనే మనిషి తన నాగరిక సమాజాన్ని సృష్టించుకున్నాడని బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్స వం సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం ఆధ్వర్యంలో ధార్మిక విజ్ఞాన ప్రాంగణం ఆవరణలో చదువరులకు వారికి నచ్చిన పుస్తకాలను ఉచితంగా అందించే కార్యక్రమం నిర్వహించారు. భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లెపల్లి సత్యనారాయణ మాట్లా డుతూ గతానికి భవిష్యత్తు కి ఒక బంధం తరతరాల సంస్కృతులకు వారధి పుస్తకాలేనన్నారు. గ్రంథాలయం నిర్వాహకులు లంకా సూర్యనారాయణ మాట్లా డుతూ రెండు దశాబ్దాల లో 1,60,000 పుస్తకాలతో గ్రంథాలయం విరాజిల్లు తున్నదని అన్నారు. కా ర్యక్రమంలో డాక్టర్ అందే సాంబశివరావు, డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, బి. ఉమామహేశ్వరరావు గ్రంథ పాలకురాలు సుభాషిణి తదితరు లు పాల్గొన్నారు

మిర్చి రైతుపై వ్యాపారి దాడి

పల్నాడు జిల్లా క్రోసూరు మండలం విప్పర్ల గ్రామానికి చెందిన కొండవీటి నాగేశ్వరరావ పత్తి మిర్చి సరుకులు అమ్ముతూ వ్యాపారం చేస్తూ ఉంటాడు. ఇటీవల నాగేశ్వరరావు మిర్చి వ్యాపారి రవికి కొంత మిర్చిని అమ్మాడు దాని తాలూకా డబ్బులు పూర్తిగా చెల్లించలేదు. దీంతో నాగేశ్వరరావు తన డబ్బు గురించి అడగ్గా నాగేశ్వరరావును ఏటు కూరు వద్ద కర్రలతో దాడి చేసి కొట్టాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి కుటుంబంలో అందరినీ చదివిస్తాం

● పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంత మందిని చదివిస్తామని గుం టూరు పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి అన్నారు. నగరం లోని 25వ డివిజన్‌లో ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్ర శేఖర్‌తో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున తల్లికి వందనం ఇస్తానని చెప్పారు. అధికారంలోకి రాక మునుపు జగనమోహనరెడ్డి ప్రజలను నమ్మించారని, అధికారంలోకి వచ్చాక కుటుంబంలో ఎంతమంది చదువుతున్నా ఒక్కరికే వర్తిస్తుందని మోసం చేశారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళాశక్తి పేరుతో సూపర్ సిక్స్ పథకాలను అందిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. మహిళలకు జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు ఇవ్వడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతామని చంద్రబాబు స్పష్టంగా తెలిపారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు తప్పక రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.



ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న గల్లా మాధవి

దళితులపై జరుగుతున్న దాడులు ఆగాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగంశెట్టి వీరయ్య, గాలం వెంకటేశ్వర్లు, రుస్తుం బాబు, వల్లంశెట్టి వీరయ్య, చేజర్ల శివ కుమార్, కదిరి సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా ఆంజనేయస్వామి దీక్ష ప్రారంభం

● కొత్తపేట ఆలయంలో హోమం, అన్నసంతర్పణ

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 23 : కొత్తపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి దీక్ష ప్రారంభాన్ని అత్యంత వైభవంగా మంగళవారం ప్రారంభించారు. హనుమాన్ దీక్ష సమాజం ఆధ్వర్యంలో ఆలయంలో అనేకమంది హనుమాన్ దీక్ష భక్తులకు హోమం, అన్నసంతర్పణ జరిపించారు. జూన్ ఒకటో తేదీన హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కొత్తపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ దీక్షలు ప్రారంభించారు. ఆంజనేయస్వామి దీక్ష తీసుకున్న భక్తులకు ఈనెల 23 నుంచి మే 31 వరకు అన్నదానం నిర్వహించనున్నట్లు సమాజం గౌరవ అధ్యక్షుడు తిరువళ్లూరి వెంకట సుబ్బారావు, సభ్యులు నాగేశ్వరరావు, అనిల్ కుమార్, వంశి, జగదీష్, రమణ తెలిపారు.

మారుతీనగర్‌లో...

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 23: స్థానిక మారుతీనగర్ మారుతీ దేవాలయంలో చైత్రపౌర్ణమి మంగళవారం హనుమాన్ మండల వ్రత దీక్షలు ప్రారంభమయ్యాయి. స్వామి మూలవిరాట్‌కు ఏకాదశ రుద్రాభిషేకం, నాగవల్లిదళార్చన నిర్వహించారు. పలువురు భక్తులు మండల వ్రత దీక్షలను స్వీకరించారు. జూన్ 5న జరిగే హోమ పూర్ణాహుతిలో పాల్గొని మాల విరమణ చేస్తారని అర్చకులు తెలిపారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటి కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పదిలో సుమేధా స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23 : స్థానిక ఎన్జీవో కాలనీలోని సుమేధ స్కూల్ విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు వై.సాయివాసంతి 589 మార్కులు, పి.మోహన్‌ప్రీతి 584, వై.రాజ్యలక్ష్మి 578, మనస్వీ 560 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా 500పైన మార్కులు 36 మంది సాధించారని వెల్లడించారు. విద్యార్థులను కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి తదితరులు అభినందించారు.

కన్నా విద్యార్థుల ప్రతిభ



భాను ప్రకాశ్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23 : పదవ తరగతిలో కన్నా స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ కన్నామాస్టారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు వెంకటభానుప్రకాశ్ 585 మార్కులు, సిహెచ్ చంద్రశేఖర్, ఐ.హారిక 584, డి.షణ్ముఖ లీలాధర్‌గుప్త 583 మార్కులు సాధించారని తెలిపారు. తమ పాఠశాల అనుసరించే విద్యావిధానాల ద్వారా విద్యార్థులు ఐఐటీల్లో, వైద్య రంగంలో సీట్లు సాధిస్తున్నారని తెలిపారు.

మత్తు వైద్య విభాగానికి రూ.5 లక్షల పరికరాలు

గుంటూరు (మెడికల్) ఏప్రిల్ 23: ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఎనస్థీషియా విభాగానికి జింకానా మాజీ అధ్యక్షుడు, ఎన్నారై డాక్టర్ రవికుమార్ త్రిపురనేని (అమెరికా) రూ.5 లక్షల విలువైన వైద్య పరికరాలను విరాళంగా పంపారు. ఈ మేరకు మంగళవారం రవికుమార్ పంపిన వైద్య పరికరాలను జింకానా కో ఆర్డినేటర్లు వీ.బాలభాస్కరరావు, పీవీ హనుమంతరావు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డీఎస్ఎస్ శ్రీనివాస ప్రసాద్‌కు అందజేశారు. ఈ పరికరాలు ఆపరేషన్ సమయంలో రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయని, పీజీ వైద్య విద్యార్థులకూ ఉపయోగకరంగా ఉంటాయని శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎనస్థీషియా విభాగానికి చెందిన వైద్యులు పోలయ్య, క్రిష్టోఫర్, శ్యామ్‌కుమార్, నాగభూషణం, రెమిమో, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం మనుగడలో ఓటే కీలకం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23 : వర్తమాన భారతీయ సమాజంలో అవిద్య, ప్రలోభాలు ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తున్న నేపథ్యంలో ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎన్నికలలో ఓటు హక్కు నూరు శాతం వినియోగించుకోవడం ద్వారా మెరుగైన అభివృద్ధికరమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవడంలో ఓటర్లు ప్రధాన పాత్ర వహిస్తారని లెట్స్ ఓట్ స్వచ్ఛంద సంస్థ ప్రచారకులు వీవీకే సురేష్ అన్నారు. లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 20 రోజులుగా నగరంలో నిర్వహిస్తున్న ప్రచారోద్యమంలో భాగంగా మంగళవారం స్థానిక చుట్టుగుంట వాకింగ్ ట్రాక్, రైతు బజార్లలో ఓటు హక్కు ప్రాధాన్యతపై టీ షర్ట్స్ ధరించి ప్లే కార్డ్స్ ప్రదర్శిస్తూ కరపత్రాలను పంచి ఓటర్లకు అవగాహన కలుగజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ ఎం.మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న సభ్యులు

జేకేసీ రోడ్డులో కారు బీభత్సం

గుంటూరు, ఏప్రిల్ 23 : జేకేసీ కళాశాల రోడ్డులో మంగళవారం ఉదయం ఓ కారు బీభత్సం సృష్టించింది. దొప్పలపూడి నాగమల్లేశ్వరి తన బైక్‌పై ఆర్టీవో ఆఫీస్ రోడ్‌లో వెళ్తూ ఉండగా తన ఎదురుగా వస్తున్న ఒక కారు అజాగ్రత్తగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి ఆపకుండా పారిపోయాడు. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న నాగమల్లేశ్వరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటపడి కారు నంబరును గుర్తించి పోలీసులకు తెలియజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల విద్యాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

● ప్రొఫెసర్ ఉమామహేశ్వరి దేవి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23 : కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకంలో కోట్లాది రూపాయలు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం మహిళా విద్య కోసం విశేష కృషి చేస్తున్నదని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరిదేవి అన్నారు. స్థానిక సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళాశాల (ప్రత్యేక ప్రతిపత్తి) 82వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కళాశాల విద్య జోన్ 3 ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ పి.కళావతి మాట్లాడుతూ ప్రతి మహిళ డిగ్రీ పట్టాతో పాటు ఉద్యోగాన్ని అందిపుచ్చుకునే అవకాశాన్ని విద్యాశాఖ శిక్షణను అందిస్తున్నదని తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.రమ జ్యోత్స్న కుమారి మాట్లాడుతూ అటానమస్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలగా 24 కోర్సులు నిర్వహిస్తూ ప్రత్యేక శిక్షణల ద్వారా ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది నుంచి జాతీయ విద్య ప్రణాళికలో కళాశాల చేరిందన్నారు. విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ అబ్రహం లింకన్, స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ కే.సుబ్బరత్నమ్మ, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ధాత్రి కుమారి, డాక్టర్ షాహిదా అక్తర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఆచార్య ఉమామహేశ్వరి తదితరులు

అరసం కవితల పోటీల ఫలితాలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 23: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయిత సంఘం 'నేటి ఎన్నికల తీరు తెన్నెలు' అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీ ఫలితాలను అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాదు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వైజాగ్‌కు చెందిన పతివాడ నాస్తిక్ రాసిన 'మర్యాదస్తుల రాజ్యం కోసం' కవితకు ప్రథమ, పోతిరెడ్డిపాలెనికి చెందిన నల్లు రమేష్ రాసిన 'చెరువు ఎగిరిపోయింది'కు ద్వితీయ, మానేపల్లికి చెందిన మోకా రత్నరాజు రాసిన 'మొద్దు చీపిరి' కి తృతీయ స్థానానికి ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన కవితలకు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతులను అందజేయనున్నట్టు చెప్పారు. వీటితో పాటు అయ్యా నేను ఓటియ్యా, సీతాకోక చిలుక తిరోగోమనం, నోటా తూటా పేల్చే తెలివైన ఘాటరు అనే కవితలు ప్రత్యేక బహుమతులకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. పోటీకి వచ్చిన 84 కవితలలో 14 సాధారణ ప్రచురణకు అర్హమైన కవితలు, ప్రముఖ కవితలతో ప్రచురిస్తున్న ఎన్నికల భారతం కవితా సంకలాన్ని మే 1వ తేదిన గుంటూరులో జరిగే సభలో డాక్టర్ పాపినేని శివశంకర్ ఆవిష్కరిస్తారని తెలిపారు.

రేపు గుంటూరుకు ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రాక

● సంజీవయ్యనగర్, రాజీవ్‌గాంధీనగర్‌లో రోడ్ షో

గుంటూరు, ఏప్రిల్ 23: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం గుంటూరు నగరంలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తోన్న ఆమె నగరంలో రోడ్ షో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. గురువారం మధ్యాహ్నం గుంటూరు చేరుకోనున్న ఆమె సాయంత్రం సంజీవయ్యనగర్, రాజీవ్‌గాంధీనగర్, శారదాకాలనీ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలుసుకోనున్నారు. అనంతరం రోడ్‌షో నిర్వహించి ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీ అభ్యర్థిగా జంగాల నామినేషన్ దాఖలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 23 : ఇండియా కూటమి బలపరిచిన గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డికి జంగాల అజయ్‌కుమార్ నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇండియా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, వామ పక్షాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ధరిత్రి పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి

● పర్యావరణ పరిరక్షణ ఉద్యమ నేత నారపరెడ్డి

గుంటూరు, ఏప్రిల్ 23 : ధరిత్రి పరిరక్షణలో అందరూ భాగస్వాములై భావితరాల మనుగడకు, జీవన భద్రతకు భరోసా కల్పించాలని పర్యావరణ పరిరక్షణ ఉద్యమ నేత టి.నారపరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'భూగోళ పరిరక్షణ ధ్యేయం కావాలి' అన్న అంశంపై మంగళవారం జరిగిన ప్రపంచ ధరిత్రి దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. మానవాళి స్వయం కృతాపరాధం వల్ల పీల్చేగాలి, తాగే నీరు, పండించే నేల తీవ్ర కాలుష్యానికి గురవు తున్నాయన్నారు. భూ గోళ పరిరక్షణే లక్ష్యంగా అవగాహన ముమ్మరం చేసేందుకు ప్రపంచ దేశాల్లో ధరిత్రి దినోత్సవం నిర్వ హిస్తున్నారన్నారు. ప్లాస్టి క్ వినియోగం కారణంగా తలెత్తుతున్న దుష్ప్రభావాలు, ఆ వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం పై ఐక్యరాజ్యసమితి ప్రచారాన్ని విస్తృతం చేస్తుందన్నారు. హెల్త్ ఎవేర్‌నెస్ అధ్యక్షుడు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ భూగోళానికి పొంచి ఉన్న అనర్థాలను నియం త్రించేందుకు పర్యా వరణ హితకరమైన విధానాల అమలుతో ప్రపంచ దేశాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లడం అత్యా వశ్యమన్నారు. సమా వేశంలో పర్యా వరణ ప్రచారకులు ఆర్‌వీ సింగరయ్య, ఉద్య మకారులు పీఎస్ మూర్తి తదితరులు ప్రసంగించారు.

మోసపు హామీల వైసీపీని తరిమికొట్టండి

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్



డేగల ప్రభాకర్

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువునా ముంచేసిన వైసీపీని తరిమికొట్టాలని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ విమర్శించారు. పార్టీ నగర కార్యాలయంలో ప్రభాకర్ మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. పేదల కష్టార్జితాన్ని జగన్ ప్రభుత్వం జలగలా దోచుకుతింటోందని మండిపడ్డారు. మద్యం ధరలను మూడు రెట్లు పెంచి సామాన్యులను దోచేస్తున్నారని, మద్యంపై వచ్చే అదనపు ఆదాయమంతా జగన్‌కే చేరుతోందని విమర్శించారు. కోతల ప్రభుత్వానికి వాత పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ నిరంకుశ పాలనతో ప్రజలంతా విసిగిపోయారని అన్నారు. ఎన్నికల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి గెలవాలని వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాల ద్వారా మహిళలు, రైతులు, యువకులకు సంక్షేమ ఫలాలు అందిస్తామని వెల్లడించారు.

విశ్వాసఘాతకుడు జగన్మోహన్‌రెడ్డి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): విశ్వాసఘాతకుడిగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నైతికత, విశ్వసనీయత లేని వ్యక్తికి మరోఛాన్స్ ఇచ్చి రాష్ట్రానికి అన్యాయం చేద్దామా? ప్రజలారా ఆలోచించండి అంటూ ఆయన పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డి కపటత్వాన్ని, విధ్వంసాన్ని, అవినీతిని, అబద్ధాలను అర్థం చేసుకొని వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు.

పైసల కోసమే పెమ్మసానిపై పేటీఎం బ్యాచ్ ఆరోపణలు

● రజక సంఘం నేత కంచర్ల శ్రీనివాసరావు

గుంటూరు, ఏప్రిల్ 23: వైసీపీ నాయకులు విదిల్చే పైసల కోసమే కొందరు రజక సంఘాల నాయకుల ముసుగులో గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌పై అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నారని రజక సంఘం నేత కంచర్ల శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొరిటపాడులోని కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ నేతల వద్ద ముడుపులు అందుకున్న కొందరు పేటీఎం బ్యాచ్ రజక సంఘాల పేరుతో చలామణీ అవుతూ పెమ్మసాని రజకులను తూలనాడాడంటూ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పెమ్మసానిపై చేస్తోన్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. పశ్చిమ నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన రజక మహిళ మాధవి ఘన విజయంతో అసెంబ్లీలోకి అడుగు పెట్టటం ఖాయమని స్పష్టం చేశారు.

రోటరీ క్లబ్ ఆఫ్ సెన్టినియల్ సేవలు ప్రశంసనీయం

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు,ఏప్రిల్ 23: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెన్టినియల్ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అభినందించారు. క్లబ్ ప్రెసిడెంట్ కొమ్మాలపాటి (కెఎస్ ఆర్) అధ్యక్షతన నగరంలో శిల్పారామం వద్దనున్న ఎంవీఎస్ కోటేశ్వరరావు స్కూల్‌లో డిజిటల్ క్లాసెస్‌కి అంకమ్మ డెవలపర్స్ సిఎంఆర్ కృష్ణ, రమేష్, రియల్ ఎస్టేట్ వ్యాపారి ముప్పాళ్ళ శ్రీనివాసరావుల సహకారంతో ఎల్ఈడీ టీవీని మంగళవారం అందజేశారు. లక్ష్మణరావు మాట్లాడుతూ కొమ్మాలపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన వివిధ స్కూల్స్‌కు ల్యాప్‌ట్యాప్‌లు, కంప్యూటర్లు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేయటం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అన్నే రత్న ప్రభాకర్, డాక్టర్ మద్దినేని సుధాకర్, క్లబ్ గౌరవసభ్యులు ఏనుగుల రమణ బాబు, గుంటూరు బ్రహ్మారెడ్డి, హెడ్ మాస్టర్ తాండవకృష్ణ, సిరి స్వీట్స్ విజయ్, వికాస్, సుధీర్ బాబు, వికాస్ సురేష్, గుంటూరు శివ, మారుతీ తదితరులున్నారు.



ఎల్ఈడి టీవీని అందజేస్తున్న లక్ష్మణరావు, కొమ్మాలపాటి తదితరులు

ఘనంగా ప్రారంభమైన నృత్య దినోత్సవం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 23 : శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ, కొరిటెపాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవం స్థానిక బృందావన్‌గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు సీ హెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, రామరాజు లక్ష్మీ, శ్రీనివాసరావు దంపతులు ప్రారంభించారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు స్వాగతోపన్యాసం చేసారు. వారం రోజుల పాటు జరిగే నృత్య ప్రదర్శనల్లో దాదాపు దేశవ్యాప్తంగా 34 మంది కళాకారులు పాల్గొంటారని ఆయన వివరించారు. అనంతరం ఆత్రేయి దత్త(కోల్‌కత్తా), సందీప్ కుందు (పశ్చిమ బెంగాల్), గరిణి సాయికుమార్, సంతోష్ కుమార్(హైదరాబాదు) ఒడిషా, కూచిపూడి నాట్యాన్ని, పేరిణి శివతాండవాన్ని ప్రేక్షక జన రంజకంగా ప్రదర్శించారు. సంస్థ వ్యవస్థాపకులు, కార్యదర్శి డాక్టర్ కాజ వేంకట సుబ్రహ్మణ్యం కళాకారులను నృత్య శిరోమణి, యువ కళారత్న బిరుదులతో సత్కరించారు. కార్యక్రమాలను సంస్థ కోశాధికారి నాగలక్ష్మి, తాళ్లూరి ధరణీలు పర్యవేక్షించారు.




నృత్య దినోత్సవం ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు

ఐదేళ్లలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

గుంటూరు, ఏప్రిల్ 23: వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ళలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంతో సర్వతోముఖాభివృద్ధి సాధించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం 22వ డివిజన్ శ్రీనివాసరావుపేటలో మనతో మన రజినమ్మ కార్యక్రమం నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గేదెల నాగరమణి, పార్టీ నాయకులు గేదెల రమేష్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఎస్‌వీఎన్‌కాలనీ వెంకటేశ్వర స్వామి గుడి వద్ద పూజలు చేసి డివిజన్‌లో ప్రచార కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడ నుంచి జేకేసీ నగర్, వికాస్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు.



రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం వద్ద వైసీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన బారికేడ్లు



జిల్లా రాజకీయాల్లో తారాతోరణం

- కొంతమంది ఇక్కడి నుంచే గెలుపు, ఓటమిలు
- మరికొందరు ఇతర ప్రాంతాల్లో విజయకేతనం

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సినీనటులు రాజకీయాల్లో ప్రవేశించడం కొంగర జగ్గయ్యతో ప్రారంభమైంది. సీనియర్ కమ్యూనిస్టు నేత మాదాల నారాయణ స్వామిని ఓడించడానికి అప్పట్లో కాంగ్రెస్ జగ్గయ్యను బరిలోకి దించింది. దుగ్గిరాల ప్రాంతానికి చెందిన జగ్గయ్య సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ప్రకాశం జిల్లా ఒంగోలు ఎంపీగా పోటీ చేసి నారాయణ స్వామిని ఓడించారు. ఈ పరిణామం అప్పట్లో సంచలనమైంది. ఆ తర్వాత సినీ తారల చూపు రాజకీయాల వైపు కూడా మళ్లింది. అయితే వారిలో చాలామంది రాజకీయ తెరంగేట్రం చేయడం, కొద్దికాలం తర్వాత దూరమైపోవడం జరిగింది.

● సినీ నిర్మాత డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు 1999లో గుంటూరు జిల్లా బాపట్ల లోక్‌సభ నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. జన్మభూమి పథకం ద్వారా ఆయన తన సొంత నిధులను మ్యాచింగ్ గ్రాంట్‌గా వెచ్చించి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. బాపట్ల నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా రామానాయుడు హయాంలో జరిగిన అభివృద్ధి పనుల శిలాఫలకాలు మనకు కనిపిస్తుంటాయి. అయినా 2004 ఎన్నికల్లో రామానాయుడు ఓడిపోయారు. అప్పటి నుంచి ఆయన రాజకీయాలకు దూరమయ్యారు.

● గుంటూరు జిల్లా బుర్రిపాలెం గ్రామానికి చెందిన సినీనటుడు కృష్ణ 1989లో ఏలూరు ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బోళ్ల బుల్లిరామయ్యను ఓడించిన కృష్ణ 1991లో అదే బులిరామయ్యపై ఓడిపోయారు. అప్పటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉండి గత ఏడాది కన్నుమూశారు.

● సినీనటి ఊర్వశి శారద 1996లో టీడీపీ అభ్యర్థిగా తెనాలి నుంచి ఎంపీగా గెలుపొందారు. 1998లో తెనాలి పార్లమెంట్‌లోనే ఓడిపోయారు. 1999లో నెల్లూరు జిల్లా వెంకటగిరి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. తరువాత కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

● నటి జమున 1985లో గుంటూరు జిల్లా మంగళగిరి నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. 1989లో కాకినాడలో కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభకు పోటీ చేసి గెలుపొందారు. 1991లో ఓడిపోయారు. తరువాత కొన్నాళ్లు బీజేపీలో కొనసాగారు. ప్రస్తుతం క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

శభాష్.. నాగిరెడ్డి

- ఇండిపెండెంట్‌గా నిలిచి.. గెలిచిన జూలకంటి నాగిరెడ్డి
- అభినందించిన పీవీ నరసింహారావు



మాచర్లటౌన్, ఏప్రిల్ 21: మాచర్ల అంటే రసవత్తర రాజకీయాలకు పేరుగాంచిన నియోజకవర్గం.. ఇక్కడ పార్టీలు మారడం అంటే చాలా తేలిక. ఎవరు ఏ పార్టీలో ఉంటారో చెప్పలేం. ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీకి కోవర్టుగా వ్యవహరిస్తుంటారు. అధికారంలో వున్నంతకాలం పనులు చక్కబెట్టుకోవడం పార్టీ ఓడిపోతుందనుకుంటే చొక్కాలు మార్చినట్లు పార్టీలు మార్చడం ఇక్కడ రివాజుగా మారింది. ఇక్కడ పార్టీ గుర్తు మీద గెలవడమంటేనే ఎంతో కష్టంతో కూడుకున్న పని. అటువంటిది ఇండిపెండెంట్‌గా గెలిచారంటే సామాన్యమైన విషయం కాదు. ఆ కుటుంబానికి ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాతులుండడం, ప్రజల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారనే నమ్మకం ఉండడమే. అటువంటి కోవకు చెందినదే జూలకంటి నాగిరెడ్డి కుటుంబం అనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. 1967లో నాగిరెడ్డి ఇండిపెండెంట్‌గా పువ్వు గుర్తుపై పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి వెన్నా లింగారెడ్డిపై 72 ఓట్లతో ఓడారు. మళ్లీ 1972లో పులిగుర్తుపై పోటీచేసి లింగారెడ్డిపై 11,169 మెజార్టీతో గెలిచి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. అప్పుడు అసెంబ్లీ స్పీకర్‌గా వున్న పిడతల రంగారెడ్డి చాంబర్‌కు వెళ్లిన నాగిరెడ్డి సీఎం పీవీ నరశింహారావుకు నమస్కారం చేశారు. అప్పుడు పీవీ ఇండిపెండెంట్‌గా గెలిచింది మీరేనా.. నీవు మాములోడివి కాదయ్యా.. మా కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా బంపర్ సీట్లు వస్తే నీవు గెలవడం రికార్డు అని నాగిరెడ్డి భుజాల మీద చేతులు వేసి పీవీ శభాష్ అని ప్రశంసించినట్లు రెంటచింతల మాజీ సర్పంచ్ అల్లం మర్రెడ్డి(17 సంవత్సరాలు సర్పంచ్) గుర్తు చేశారు. సార్ సార్ 1967లో పోటీ చేసినప్పుడు కౌంటింగ్ సమయంలో కరెంట్ నిలిపి వేశారని అందుకనే తక్కువ మార్జిన్‌తో ఓడిపోయాయని గుర్తు చేయగా పీవీ పెద్దగా నవ్వి తమ ప్రభుత్వ తప్పిదం గురించి ఏమి మాట్లాడలేకపోయారు. ప్రస్తుతం బరిలో ఉంది ఆయన కుమారుడే బ్రహ్మారెడ్డి. తల్లిదండ్రులు మూడుసార్లు ఎమ్మెల్యేలుగా పనిచేసినా బ్రహ్మారెడ్డి కుటుంబానిది సాధారణ జీవితమే.

టీడీపీ, జనసేన ప్రచారంలో ఏటీవీ బైక్‌లు

- ఆకట్టుకుంటున్న వినూత్న విధానం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 23 : లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు కొత్త పంథా అనుసరిస్తున్నారు. ఎన్నికల ప్రచారం కోసం ఏటీవీ బైక్‌లు వినియోగిస్తున్నారు. ఈ ప్రాంతానికి ఇవి కొత్త కావడంతో పలువురిని ఆకట్టుకుంటున్నాయి. తెనాలి నియోజకవర్గంలో అభ్యర్థులు ఐదు బైక్‌లను ఏర్పాటుచేసి వాటికి జెండాలు కట్టి తిప్పుతున్నారు. బీచ్‌లు, ఘాట్ ఏరియాలు, ఇసుక ప్రదేశాలలో విరివిగా వాడే ఈ బైక్‌లు ఈ ప్రాంతానికి ఇంతవరకు పరిచయం కాలేదు. టీడీపీ, జనసేన జెండాలతో తిరుగుతున్న బైక్‌లను చూసి వీటిని తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పనిలోపనిగా తమ పార్టీ జెండాలు జనం చూస్తుండటంతో ప్రచారానికి ఉపయోగపడుతుందని పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రచారంలో వినియోగిస్తున్న వినూత్న బైక్‌లు

నామినేషన్.. తీసుకోం..

టైంకి రాలేదు మరి..

- అంబటి మురళీకృష్ణ నామినేషన్‌కు ఆదిలోనే హంసపాదు
- సమయం దాటిపోవటంతో నామినేషన్ నిరాకరణ
- నిరుత్సాహంతో వెనుతిరిగిన వైసీపీ శ్రేణులు



ఐలాండ్ సెంటర్‌లో అంబటి మురళీ నామినేషన్ సభ జనం లేక వెలవెల


పొన్నూరుటౌన్, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పొన్నూరు అసెంబ్లీ స్థానానికి నామినేషన్ దాఖలు చేయటానికి ఆర్భాటంగా ఏర్పాట్లు చేశారు. అయితే ఆయనకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. హంగు ఆర్భాటాలతో నామినేషన్ దాఖలు కార్యక్రమాన్ని చేపట్టినప్పటికీ కార్యాలయానికి సకాలంలో చేరుకోకపోవటంతో నామినేషన్‌ను స్వీకరించేందుకు అధికారులు అంగీకరించలేదు. 3 గంటల లోపు వస్తేనే నామినేషన్లు స్వీకరిస్తామని లేదంటే కుదరదని రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.లక్ష్మీకుమారి తేల్చిచెప్పారు. దీంతో వైసీపీ శ్రేణులు ఏం చేయాలో పాలుపోక కేవలం ప్రసంగాలతోనే సరిపెట్టుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అడుగడుగునా.. ఉల్లంఘన

నామినేషన్ దాఖలు సందర్భంగా 100 మీటర్లలోపు నిషేదాజ్ఞలు అమలు చేశారు. ఆ పరిధి దాటిన తర్వాత కేవలం 20 మీటర్ల వ్యవధిలో వైసీపీ కార్యాలయం వద్ద భారీగా టెంట్లలోకార్యకర్తలకు మాంసంతో వంటకాలు వండించి భోజన ఏర్పాట్లను చేశారు. పురుషులకైతే రూ.200 నగదు, క్వార్టర్ మద్యం బాటిల్, రూ.100 పెట్రోల్ కూపన్, బిర్యాని అందచేశారు. మహిళలకు రూ.500 నగదు, బిర్యాని ఏర్పాటు చేశారు. నాగేంద్ర స్వామి పుట్టఎదురుగా ఎటువంటి అనుమతులు లేకుండా భారీ ఎత్తున వంటలు వండించారు. అలాగే ఆర్వో కార్యాలయం వద్ద బారికేడ్లను సైతం వైసీపీ శ్రేణులు ధ్వంసం చేశారు. నిషేదాజ్ఞలను సైతం ఉల్లంఘించి కార్యాలయం మీదుగా రాకపోకలు సాగించారు. కార్యాలయం వద్ద వాహనాలను అడ్డంపెట్టి ట్రాఫిక్‌కు అవరోధాలు కల్పించారు. అంతా చేసినప్పటికి నామినేషన్ కార్యాక్రమానికి జనం రాకపోవటంతో వైసిపి శ్రేణులే డీలా పడ్డారు.

వేమూరు.. వకీళ్లు

- లాయర్లకు కలిసొచ్చిన వేమూరు నియోజకవర్గం
- ఒకరు ముఖ్యమంత్రిగా, ఐదుగురు క్యాబినెట్ మంత్రులుగా...



వేమూరు, ఏప్రిల్ 23: వేమూరు అసెంబ్లీ స్థానం లాయర్లకు ఎంతగానో కలిసి వచ్చింది. 1955నుండి ఇంతవరకు 15సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1965లో ఉప ఎన్నికల జరిగింది. పది మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీపడి విజయాన్ని సాధించారు. వీరిలో ఆరుగురు న్యాయవాద వృత్తిలో ప్రావీణ్యం సాధించారు. వారిలో ఒకరు ముఖ్యమంత్రిగా, ఐదుగురు క్యాబినెట్ మంత్రులుగా పనిచేశారు. 1955లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీపడి తొలి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కల్లూరి చంద్రమౌళి, 1962 ఎన్నికల్లో కూడా విజయం సాధించారు. ఆయన దేవాదాయ శాఖ మంత్రిగా, రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు. 1967, 1972 ఎన్ని కల్లో స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా, 1978లో కాంగ్రెస్ (ఐ)పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆయన మర్రి చెన్నారెడ్డి మంత్రి వర్గంలో ప్రణాళిక న్యాయశాఖ మంత్రిగా వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 1983 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీపడ్డ నాదెండ్ల భాస్కరరావు విజయం సాధించి నెల రోజుల పాటు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు. 1989ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఆలపాటి ధర్మరావు శాసనసభ ఉపసభాపతిగా, రవాణా, న్యాయ, ఉన్నత విద్య హోంశాఖల మంత్రిగా పనిచేశారు. 1994-1999 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ 1999 నుంచి 2001వరకు చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 2009-2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నిలబడి విజయం సాధించిన నక్కా ఆనందబాబు 2017నుంచి 2019 వరకు చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. ఈ విధంగా వేమూరు సెగ్మెంట్ న్యాయవాదులకు కలిసొచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు.

వచ్చే ఐదేళ్లలో నీటి సమస్య ఉండదు

- నెలవారీ వసూళ్ళలో వైసీపీ విడదల రజని
- పశ్చిమ నియోజకవర్గ ప్రచారంలో పెమ్మసాని
- రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి పోయింది : గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు రాబోయే ఐదేళ్లలో నీటి సమస్య ఉండదని టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి పశ్చిమ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 39వ డివిజన్‌లోని స్థానిక నేతాజీ నగర్, ఉద్యోగ నగర్, క్రాంతి నగర్ తదితర ప్రాంతాల్లో పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవితో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లా డుతూ స్థానికంగా ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడి, పారుదల లేని డ్రైనేజీ, మురుగుతో నిండిపోయిన సైడ్ కాలువల సమస్యలను పరిష్క రించేందుకు కృషి చేస్తానన్నారు. 2014-19 మధ్యన కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వ సహకారంతో అందిన నిధుల ద్వారా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పను లు మొదలయ్యాయని, అయితే మధ్యలో అవినీతి అధికారుల, నాయ కుల కారణంగా ఆ పనులు అటకెక్కాయని చెప్పారు. ప్రభుత్వ నిధుల ను కొందరి అకౌంట్లకు మళ్ళించే ప్రయత్నాలు జరిగాయని, ఎన్నికల తర్వాత పూర్తి వివరాలు బయట పెడతానని అన్నారు. గుంటూరులో ప్రస్తుతం పేరుకుపోయిన నీటి సమస్యల పరిష్కారార్థం కొత్తగా నిధు లు తేవాల్సిన పనిలేదని, అందుబాటులో ఉన్న సాంకేతికతను, సౌకర్యా లను పూర్తి స్థాయిలో వినియోగించుకోగలిగితేచాలని అన్నారు. రాబో యే పది నెలల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించే అవ కాశం ఉందని, ఇది పెమ్మసాని హామీ అని భరోసా ఇచ్చారు. వైసీపీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థిని రజనీపై మూడేళ్లకే అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయని, ఆ కారణంతోనే మూడేళ్లకే చిలకలూరి పేట నియోజకవర్గం విడిచిపెట్టి గుంటూరుకు చేరుకున్నారని పెమ్మ సాని తెలిపారు. కేబుల్ టీవీ, గ్రానైట్, రేషన్, అక్రమ కట్టడాలు, మున్సి పల్ షాపు కాంప్లెక్సులు ఇలా కనపడ్డ ప్రతి రంగం నుంచి నెలనెలా లక్షలకు లక్షలు అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. అలా సంపాదించిన అవినీతి సొమ్ముతో ఫ్లెక్సీలు వేయించి రాజకీ యాలు చేయాలనే ఆలోచనతో ఆమె చూస్తున్నారని విమర్శించారు. గల్లా మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అసమర్ధ పాలన వలన ఆంధ్రప్రదేశ్ 30 ఏళ్ల వెనక్కి వెళ్ళిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎక్కడ చూసినా అవినీతి అక్రమాలే రాజ్యమేలుతున్నాయన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు తమ ఇళ్ల, వాకిళ్ల వదులుకొని పక్క రాష్ట్రాలకు వెళ్లిపోవాల్సిందేనన్నారు. ఈ దుర్మార్గపు పరిస్థితి నుంచి మార్పు తీసుకురావాలని, పరిశ్రమలను తీసుకువచ్చి, ఉద్యోగావకాశా లను కల్పించాలి. ఆయా అభివృద్ధి, సంక్షేమాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఓటు వన్‌సైడ్‌గా వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, ముస్లిం నాయకులు సయ్యద్ ముజీబ్, బీసీ నాయకులు నిమ్మల శేషయ్య, కార్పొరేటర్ వేములపల్లి శ్రీనివాసరావు(బుజ్జి), షేక్ రుస్తుంబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న పెమ్మసాని, గల్లా మాధవి

పదివేల ఇళ్లను గాలికి వదిలేసిన జగన్ ప్రభుత్వం

రాజధానిలో 80 శాతం పూర్తయిన ఇళ్లను జగన్ గాలికి వదిలేశాడ ని గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ విమర్శించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 42వ డివిజన్లోని పలువురు వైసీపీ నాయకులు పెమ్మసాని, పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ మరో 10- 20 శాతం పూర్తి చేసి ఉంటే పది వేల మందికి నివాసం దొరికి ఉండేదని అన్నారు. నేటి సమాజంలో ఒక సామాన్య గృహిణికి ఉండే ఒకే ఒక్క కల సొంతిల్లు అని, అలాంటి కలలను ఈ జగన్ పది వేల మందికి దూరం చేశాడని ఆరోపించారు. గుంటూరు చుట్టుపక్కల అంతా నది పారుతున్నా గుంటూరు నగరానికి నీళ్ల అందడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న నిధులపై మాఫియాలాగా పడుతున్న కొందరు వైసీపీ నాయకులు నగరవాసులకు తాగునీళ్లను దూరం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గల్లా మాధవి మాట్లాడుతూ నిజమైన సంక్షేమం మే 13 తర్వాతే లభిస్తుందన్నారు. నోట్లు విసిరితే ఓట్లు కురుస్తాయని వైసీపీ భ్రమ పడుతోందని, అది భ్రమేనని మే 13న ఓటు ద్వారా ప్రజలు రుజువు చేయాలని కోరారు.

పన్నుపై.. ప్రజాగ్రహం



- 15 శాతం పన్ను పెంపుతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- దీంతో మూగబోయిన ఆస్తిపన్ను చెల్లించమని ప్రచారం చేసే వాహనాలు
- వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్లు, మునిసిపాలిటీల పరిధిలో ఈ నెలంతా విస్తృతంగా ప్రచారం చేయాల్సిన ఆస్తిపన్ను చెల్లింపు ప్రచార వాహనాలు గత రెండు, మూడు రోజుల నుంచి మూగబోయాయి. అంతకుముందు వరకు ఆస్తి పన్ను రెండు అర్ధ సంవత్సరాలు కలిపి ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రిబేటు ఉంటుంది. ఆ తర్వాత నుంచి వడ్డీ భారం పడుతుందని విస్తృతంగా ప్రచారం చేస్తూ పన్ను చెల్లింపుదారులకు అవగాహన కల్పించేందుకు ఈ వాహనాల ద్వారా మునిసిపల్ అధికారులు ప్రయత్నించారు. అలానే వార్డు సచివాలయాల సెక్రెటరీలు వాట్సాప్ గ్రూపులు, ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి పన్ను డిమాండ్ నోటీసులు జారీ చేస్తూ ఈ నెలాఖరు వరకు ఉన్న ఐదు శాతం రిబేటుపై అవగాహన కల్పిస్తూ వచ్చారు. అయితే హఠాత్తుగా పైనుంచి ఆదేశాలు రావడంతో ప్రస్తుతం అంతా మిన్నకుండిపోయారు.



గతంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయని విధంగా ఏటా 15 శాతం ఆస్తి పన్ను ఆటోమేటిక్‌గా పెరిగే విధానాన్ని వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఈ విధానం అమలులో ఉంది. అయితే ఆ నగరం మెట్రోపాలిటన్ స్థాయిలో ఉన్నది. అంతేకాకుండా అక్కడ సౌకర్యాలకు, ఇక్కడికి నక్కకి నాగ లోకానికి ఉన్నంత వ్యత్యాసం ఉంటుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్‌ప్రకాష్ సూచనలతో ఈ విధానాన్ని అమలులోకి తీసుకురావడంతో ఏటా పన్ను పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 15 శాతం పెరిగింది. గత ఏడాది గుంటూరు నగరంలో కేవలం 59 చదరపు గజాల్లో అసెస్‌మెంట్ నెంబరు. 1021107871లో ఉన్న భవనానికి రూ.2208 ఉండగా అది ఈ ఏప్రిల్ నెల నుంచి రూ.2,525కి చేరింది. దీనిని పరిగణనలోకి తీసుకొంటే ఏకంగా రూ.317 ఆస్తిపన్ను అర్ధ సంవత్సరానికే పెరిగింది. మంగళగిరి తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో అసెస్‌మెంట్ నెంబరు. 1023015025లో ఉన్న ఆస్తిపై గత ఆర్థిక సంవత్సరంలో ఆరు నెలలకు రూ. 2,794 ఉండగా అది నేడు రూ.2,850కి పెరిగింది. పొన్నూరులో అసెస్‌మెంట్ నెంబరు. 1025006854లో ఉన్న ఆస్తిపై గత అర్ధ సంవ్సరంలో రూ.2406 ఉండగా అది నేడు రూ.2,619కి పెరిగింది. తెనాలిలో అసెస్‌మెంట్ నెంబరు. 1028025075లో ఉన్న ఆస్తిపై గత అర్ధ సంవత్సరంలో రూ.14,909 ఉంటే ఇప్పుడు అది రూ.15,207కి పెరిగింది.

ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

ఆస్తిపన్నుపై ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా 15 శాతం పెంచుకొంటూ పోతుండటంపై పట్టణ, నగర ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. దీని వలన ఆరు నుంచి ఏడు సంవత్సరాల్లోనే ఆస్తి పన్ను 100 శాతం పెరిగిపోతుంది. కాగా ప్రస్తుతం గుంటూరు జిల్లా వ్యాప్తంగా పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉండటాన్ని గమనించిన వైసీపీ అభ్యర్థులు మునిసిపల్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పన్ను చెల్లించమని ఒత్తిడి చేయొద్దని ఆదేశాలు జారీ చేశారు. వాటిని అధికారులు యథాతథంగా పాటిస్తూ మైకులతో హోరెత్తించే వాహనాలను నిలిపేశారు.

గుంటూరు లోక్‌సభకి మరో ఐదు నామినేషన్లు

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ స్థానానికి మంగళవారం మరో ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. సీపీఐ తరఫున జంగాల అజయ్‌కుమార్‌తో పాటు మరో నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లా పరిధిలోని అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి తాడికొండలో ఇద్దరు, మంగళ గిరిలో వైసీపీ తరఫున మురుగుడు లావణ్యతో పాటు మరో ఎనిమిది మంది, ప్రత్తిపాడులో ఐదుగురు, తెనాలిలో ముగ్గురు, గుంటూరు పశ్చిమలో ముగ్గురు, గుంటూరు తూర్పులో వైసీపీ నుంచి నూరీ ఫాతిమా షేక్‌తో పాటు నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు.

రేపటితో నామినేషన్ల ఘట్టం ముగింపు

గుంటూరు లోక్‌సభ, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గురువారం మధ్యాహ్నం 3 గంటల కు నామినేషన్ల ఘట్టం ముగియనుంది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో ఒకరిద్దరు మినహా ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులందరూ భారీ ర్యాలీలతో నామినేషన్లు దాఖలు చేశారు. స్క్రూటినీలో ఏమైనా ఇబ్బంది తలె త్తితే ముందుజాగ్రత్తగా మూడు, నాలుగు సెట్లు నామినేషన్లు వేశారు. అలానే కుటుంబసభ్యులతోనూ నామి నేషన్లు దాఖలు చేయించారు.

వైసీపీ పాలకులకు అభివృద్ధి అంటే తెలుసా?

● ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు



టీడీపీ సూపర్-6 కరపత్రాన్ని మహిళకు అందజేస్తున్న రామాంజనేయులు

కాకుమాను, ఏప్రిల్ 23: అధికారంలో ఉన్న వైసీపీ పాలకులకు అభివృద్ధి అంటే ఎంటో తెలుసా అని ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు ప్రశ్నించారు. మండలపరిధిలోని చిన్నలింగాయపాలెం, పాండ్రపాడు, కొల్లిమర్ల గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించి టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామాలను అనుసంధానం చేసే రహదారులు అధ్వానంగా ఉన్నాయన్నారు. ఐదేళ్లలో వైసీపీ చేసింది లేదని అన్నారు. వైసీపీకి విధ్వంసాలు, కూల్చివేతలు, దాడులు, కేసులతో వేధించడం తప్ప వారికి అభివృద్ధి తెలియదని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు, అమ్మకు వందనం పేరుతో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థి తల్లి బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేస్తామన్నారు. సుదీర్ఘ కాలం రాష్ట్రాన్ని పరిపాలించిన చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా చూడాలని ప్రతి పౌరుడు కోరుకుంటున్నారన్నారు. మే 13న జరిగి ఎన్నికలలో టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలుపొందే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి గత పాలకులు చేసింది శూన్యం

● వడ్డేశ్వరం, కాజాలో సీపీఎం శ్రేణుల విస్తృత ప్రచారం



వడ్డేశ్వరంలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకర్

మంగళగిరి, ఏప్రిల్ 23: గత పాలకులు మంగళగిరి ప్రజలకు, నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని మంగళగిరి సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు అన్నారు. బుధవారం కాజ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ శివశంకరరావు మాట్లాడుతూ కాజ గ్రామంలో ప్రజల పక్షాన సీపీఎం చేసిన పోరాటాలను ప్రజలందరూ గుర్తించి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నేతలు ఈమని అప్పారావు, బి.కోటేశ్వరీ, ఈదా ప్రతాప్‌రెడ్డి, ఎస్.విజయలక్ష్మీ, ఎస్.సుమ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి, ఏప్రిల్ 23: రాష్ట్రంలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మంగళగిరి సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకర్, సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేపూరి వెంకట నాగ గోపాలరావుతో కలిసి వడ్డేశ్వరంలో మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా జొన్నా శివశంకర్‌ను, గుంటూరు ఎంపీ అభ్యర్థిగా జంగాల అజయ్‌కుమార్‌ను గెలిపించాలని స్థానిక సమస్యలను పరిష్కరించే సత్తా ఇండియా కూటమి అభ్యర్థులకు మాత్రమే ఉందని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు బి.శివనాగరాణి, పల్లె కృష్ణ, రాజ్‌కుమార్, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య కార్మికుల ధర్నా

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 23: పెండింగ్ జీతాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంటీఎంసీ తాడేపల్లి జోనల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ రెండు నెలల నుంచి జీతాలు, హెల్త్ అలవెన్సులు రాకపోవడంతో పారిశుధ్య కార్మికులు అప్పులు చేయాల్సి వస్తుందని, చెప్పారు. ఏడాదిగా కొబ్బరి నూనె, చెప్పులు, యూనిఫారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. అదేవిధంగా విలీన గ్రామాల కార్మికులకు పెంచిన జీతం రూ.21,000లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందం ప్రకారం సమ్మె కాలానికి జీతం ఇవ్వాలని సంక్రాంతి సందర్భంగా వెయ్యి బోనస్ వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడి న వినతిపత్రాన్ని కమిషనర్ నిర్మల్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటియూ నేతలు బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్ఎస్ చెంగయ్య, ఎం రవి, శివనాగేశ్వరరావు, వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అగ్ని ప్రమాదం

● మంటలను అదుపు చేసిన రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది

తాడికొండ, ఏప్రిల్ 23: తాడికొండ తహసీల్దార్ కార్యాలయం వెనుక మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. గమనించిన రెవెన్యూ సిబ్బంది మంటలను అదుపుచేశారు. వివరాల్లో కి వెళితే తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలోని చెత్తను తగలబెట్టే క్రమంలో నిప్పురవ్వలు ఎగసిపడి ఎండిపోయిన పిచ్చిమొక్కలపై పడటంతో అగ్ని ప్రమాదం సంభవించింది. వేసవి కాలం ఎండ తీవ్రంగా ఉండటంతో మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన రెవెన్యూ సిబ్బంది ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. తహసీల్దార్ కార్యాలయానికి పక్కనే ఉన్న బీఎస్ఎస్‌బీ కళాశాల ఆటస్థలంలోకి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన రెవెన్యూ సిబ్బంది వాటర్ ట్యాంకు తీసుకువచ్చి మంటలను అదుపుచేశారు. కొద్ది సేపటికి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపుచేశారు. ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదు.

అమరావతి ద్రోహులను ఇంటికి పంపాల్సిందే

● ఉపాధి అవకాశాలు లేకుండా చేసిన వైసీపీ ప్రభుత్వం
● టీడీపీ సూపర్-6 పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు
● 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు పెన్షన్
● రాజధాని గ్రామాల్లో ప్రచారం చేస్తున్న శ్రావణ్‌కుమార్



ఉద్దండ్రాయునిపాలెం లంకలో ఓటు అభ్యర్థిస్తున్న తెనాలి శ్రావణ్‌కుమార్

తుళ్ళూరు, ఏప్రిల్ 23: అమరావతిని నాశనం చేసిన ద్రోహులను ఇంటికి పంపాలని నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. రాజధాని అమరావతిని నిలిపివేసి పేదలకు ఉపాధి లేకుండా చేసిన వైసీపీని ఈ ఎన్నికల్లో తరిమి కొట్టాలన్నారు. మంగళవారం ఉద్దండ్రాయునిపాలెం, మోదులంకపాలెం, రాయపూడి, పెదపరిమి గ్రామాల్లో శ్రావణ్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాయపూడి ఫిషర్‌మెన్ కాలనీలో రోడ్లు, కరెంట్ సమస్యలను శ్రావణ్‌కుమార్‌కు తెలిపారు. తాను వచ్చిన మొదటి సంవత్సరంలోనే మీ సమస్యలను తీరుస్తామని ఆయన హామీనిచ్చారు. ప్రచారంలో సూపర్-6 పథకాలను తెలియజేసి వాటి వల్ల ఎంత లబ్ధిపొందుతారో వివరించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీకి ఓటు వేస్తే మీ ఆస్తులకు గ్యారంటీ లేదన్నారు. అమరావతితో యువతకు ఉపాధి అవకాశాలు లక్షల్లో వచ్చేవన్నారు. జగన్ నిర్వీర్యం చేయటంతో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. అభివృద్ధిలో నెంబర్ వన్ చంద్రబాబు నాయుడన్నారు. అరాచకపాలన చేయటం, దోచుకోవటంలో జగన్‌రెడ్డి నెంబర్‌వన్ అని అన్నారు. ఆదర్శ పాలన కావాలంటే తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలన్నారు. తనను, గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్య క్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి మేళం భాగ్యారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరా వు, పుట్టి రామచంద్రరావు, నూతల పాటిరామారావు, బెల్లంకొండ నరసింహరావు, అనుమోలు సత్యనారాయణ, ఉప్పలపాటి సాంబశివరావు, (బెం గళూరు). ఉద్దండ్రాయునిపాలెం, రాయపూడి, పెదపరిమి గ్రామాల టీడీపీ అధ్యక్షులు బత్తుల కోటేశ్వరావు, మూల్పూరు శ్రీనివాసిరావు, అత్తిపట్ల బాలయ్య, జనసేన మండల అధ్యక్షుడు ఎర్రగోపు నాగరాజు, బీజేపీ ఉపాధ్యక్షుడు సరిపూడి సాంబశివరావు, మాజీ జడ్పీటీసీ బెజవాడ నరేంద్రబాబు, మాజీ ఎంపీటీసీలు షైనేని గిరిజా, జొన్నలగడ్డ కిరణ్, జనసేన, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్లు విజయశేఖర్, కంతేటి బ్రహ్మయ్య, టీడీపీ నాయకులు మల్లవరపు రాజు, కర్నాటి శ్రీనివాసరావు, కాటా అప్పారావు, చేకూరి రవి, బి.నాగేశ్వరావు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు సముచిత స్థానం

● వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్లు అలంకారప్రాయమే.. జయహో బీసీ సదస్సులో నేతలు



సదస్సులో మాట్లాడుతున్న బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్దల సదాశివరావు

తుళ్లూరు, ఏప్రిల్ 23: టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు సముచిత స్థానం దక్కిందని బీసీ నేతలు తెలిపారు. మంగళవారం తుళ్లూరులోని పార్టీ కార్యాలయంలో జయహో బీసీ సదస్సు జరిగింది. బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుమ్మా లక్ష్మీనారాయణ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్దల సదాశివరావు సదస్సులో ప్రసంగించారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడగానే వస్తుందన్నారు. దానిని చంద్రబాబునాయుడు మినీ మ్యానిఫెస్టోలో పెట్టారన్నారు. అంతే కాకుండా 50 సంవత్సరాలు నిండిన ప్రతి బీసీకి నెలకు రూ.4వేలు పింఛను టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అమలు చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం పలు బీసీ కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి విడదీసిందన్నారు. అవి అలంకారప్రాయం తప్పితే బీసీల ఉన్నతికి ఉపయోగపడింది లేదన్నారు. అదే బీసీ కార్పొరేషన్ కింద టీడీపీ ప్రభుత్వంలో బీసీల ఆర్థిక ఉన్నతికి 33 కోట్లు కేటాయించిందన్నారు. రిజర్వేషన్ 34 శాతం కేటాయించిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 24శాతానికి కుదించి బీసీలను అణగదొక్కిందన్నారు. చంద్రబాబునాయుడు బీసీలకు మరోసారి సముచిత స్థానం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారని ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీలపై ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ నిలాల కృష్ణారావు, నాయకులు తాటి శ్రీనివాసరావు, మల్లెల శ్రీరాములు, లక్ష్మయ్యనాయక్, మండలంలో వివిధ గ్రామాల బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

నీటికుంట ప్రాముఖ్యతను తెలియజేయాలి

● ఎంపీడీవో సునీతాశర్మ



ఉపాధిహామీ పథకం కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో సునీతాశర్మ

పెదనందిపాడు, ఏప్రిల్ 23: గ్రామాల్లో రైతులకు, ప్రజలకు నీటి కుంటల ప్రాముఖ్యతను తెలియజేయాలని ఎంపీడీవో సునీతాశర్మ అన్నారు. మండలపరిధిలోని రాజుపాలెం, రావిపాడులో ఉపాధిహామీ పథకం కింద పొలాల్లో తీస్తున్న ఇంకుడు గుంతలను మంగళవారం పరిశీలించారు. నీటి ఎద్దడి నివారణకు ఇంకుడు గుంతలు ఏంతో దోహదపడతాయని, ప్రభుత్వం ఒక్కో ఇంకుడు గుంతకు రు.59 వేలు చెల్లిస్తుందని, రైతులు దీనిని సద్వినియోగించుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పనుల నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహించరాదని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నగరానికి సహకరించాలి

మంగళగిరి, ఏప్రిల్ 23: మంగళగిరిని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని ఎంటీఎంసీ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ కోరారు. ప్రజలు, వ్యాపార సంస్థలు 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ పేపర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం, విక్రయం చేయవద్దని సూచించారు. ప్లాస్టిక్‌పై ప్రభుత్వ నిషేధాజ్ఞలు కట్టుదిట్టంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయించే వ్యాపార సంస్థలపై నగరపాలక సంస్థ, సచివాలయ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు చేపడతారని తెలిపారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించినట్టయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

789 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఏప్రిల్ 23: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 789 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.13,200 గరిష్ఠధర రూ.14,250 మోడల్‌ధర రూ.14,000 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.13,000 గరిష్ఠ రూ.14,250, మోడల్‌ధర రూ.14,000 పలికాయి.

పశ్చిమ డెల్టాకు 916 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఏప్రిల్ 23: కృష్ణాపశ్చిమ డెల్టాకు 916 క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజి వద్ద 7.2 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 70 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. మిగిలిన కాల్వలకు నీటివిడుదల నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

అరాచక పాలనతో జగన్ ఓటమి : పాతర్ల రమేష్

తాడేపల్లి, ఏప్రిల్ 23: రాష్ట్రాన్ని డ్రగ్స్ పాలనగా వైఫల్యాలతో అరాచక పాలనతో నాశనం చేసిన జగన్‌కు ఓటమి ఫిక్స్ అయిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. మంగళవారం తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ అరాచక దాడులు పెరిగిపోయాయని ఇందుకు నిరసనగా గుంటూరుకు చెందిన ఒక దళిత మహిళ లక్ష్మి ఢిల్లీలో తన బొటనవేలును కోసుకోవడం ఎంతో బాధ కలిగించిందన్నారు. ఏపీలో జగన్‌కు ఒక్క చాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ఐదేళ్లు అరా చక పాలన సాగించారన్నారు. నేటికి నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యం నాశనం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. బాపట్లలో తెలుగుదేశం అభ్యర్థి నామినేషన్ సందర్భంగా అక్కడ ఎస్ఐ శివారెడ్డి టీడీపీ కూటమి కార్యకర్తలపై దురుసుగా ప్రవర్తించి వైసీపీ ఏజెంట్‌లా పని చేశారని రమేష్ ఆరోపించారు.

విద్యార్థులకు అభినందనలు తెలిపిన నిమ్మగడ్డ



విద్యార్థిని అభినందిస్తున్న రాష్ట్ర ఎన్నికల విశ్రాంత అధికారి నిమ్మగడ్డ రమేష్

పెదనందిపాడు, ఏప్రిల్ 23 గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లోని సత్య ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ కార్యాలయంలో మంగళవారం ఉత్తమ ఫలితాలు సాధించిన పెదనందిపాడు నంది పాఠశాల విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎన్నికల విశ్రాంత అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ పాల్గొని నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన వై హారికను అభినందించి, సత్కరించారు. అత్యధిక మార్కుల సాధనకు కృషిచేసిన పాలకవర్గ సభ్యులు, పాఠశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ (విశ్రాంత ఏఎస్పీ), పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

పెదనందిపాడు, ఏప్రిల్ 23: మండలపరిధిలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో డీవైఈవో పి. వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పది ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఉపాధికి ఊతం అమరావతి నిర్మాణం



తాడికొండలో నిరసనలు వ్యక్తం చేస్తున్న మహిళలు, రైతులు

తాడికొండ, ఏప్రిల్ 23: రాజధాని అమరావతి నిర్మాణం జరిగి ఉంటే ఉపాధికి ఊతం లభించేదని రైతులు, మహిళలు తెలిపారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, రాజధాని రైతులకు మద్దతుగా, బిల్డ్ అమరావతి పేరిట తాడికొండలో రైతులు, మహిళలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమరావతి నిర్మాణం జరిగితే 20 లక్షల కుటుంబాలకు రోజువారి కూలీ, 30లక్షల కుటుం బాలు చిరువ్యాపారాలు, 10 లక్షల కుటుంబాలు వాచ్‌మెన్ నుంచి మేనేజర్ వరకు ఉద్యోగాలు చేసుకొని ఉపాధి పొందేవారన్నారు. ఎన్నో అంతర్జాతీయ, జాతీయ ఐటీ కంపెనీలు, విద్యాసంస్థలు, ఆస్పత్రుల్లో ప్రజలకు జీవనోపాధి లభించేదన్నారు. రాష్ట్రాభివృద్ధి పూర్తిగా సీఎం జగన్మోహన్‌రెడ్డి నాశనం చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధినికి పాటుపడకుండా మూడు రాజధానులు నిర్మిస్తానని ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. సంక్షేమ పథకాలు అమలు కోసం ప్రభుత్వ భూములను తాకట్టు పెడుతున్నారన్నారు. అన్ని రంగాలు సర్వనాశనమయ్యాయన్నారు. రాష్ట్రాభివృద్ధి లేని ప్రభుత్వాన్ని కూల్చటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

జడ్పీ హైస్కూల్ ఐఎఫ్‌పీ ప్యానల్స్‌కు సెక్యూరిటీ బోర్డుల వితరణ

● పూర్వవిద్యార్థుల సహకారంతో రూ.40వేల విలువగల సామగ్రి



పాఠశాలకు ఐఎఫ్‌పీ ప్యానల్ సెక్యూరిటీ బోర్డులను అందిస్తున్న 1982-83బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థులు

దుగ్గిరాల, ఏప్రిల్ 23: దుగ్గిరాలలోని ఎస్ఎఫ్ జడ్పీబాలుర హైస్కూల్‌కు రూ.40వేల విలువ గల సెక్యూరిటీ బోర్డులను పూర్వవిద్యార్థులు అందించినట్లు హెచ్ఎం బాలసుందరం మంగళవారం తెలిపారు. పాఠశాలలో 1982- 83లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా తీసుకున్న నిర్ణయం మేరకు విద్యార్థులకు ఉపకరించే వస్తువులను అందించారు. పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానల్ డిజిటల్ బోర్డులకు రక్షణగా బాక్సులను ఇవ్వాలని కోరారు. కాగా బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కొందరు హెచ్ఎం బాలసుందరంనకు అప్పగించారు. సకాలంలో స్పందించి సహకరించిన పిండిబోయిన శివకుమార్, నిమ్మగడ్డ సుధాకర్, పొట్లూరి నాగరాజకుమార్, జాఫర్ మౌలాలి, విశ్వేశ్వరప్రసాద్, తురగా రాము, ఇతర బ్యాచ్‌మేట్‌లకు హెచ్ఎం ధన్యవాదాలు తెలిపారు. నిమ్మగడ్డ యుగంధర్, రాచంశెట్టి వీర మల్లేశ్వరప్రసాద్, చదలవాడ శ్రీనివాసరావు, యార్లగడ్డ శివనాగేశ్వరరావు, షేక్ ఖుదీష్, మంచికలపూడి సుబ్బారావు, ఉపాధ్యాయుడు వీవీవీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లోకేశ్ రచ్చబండ వివరాలు

మంగళగిరి, ఏప్రిల్ 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ బుధవారం మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు. సాయంత్రం 4గంటలకు చినకాకాని, 5:30 గంటలకు ఎర్రబాలెం గ్రామం, 7 గంటలకు తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరంలో జరిగే రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆరుగురు అభ్యర్థులు.. 9 నామినేషన్లు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 23: మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం ఆరుగురు అభ్యర్థుల నుంచి 9 నామినేషన్లు దాఖలయ్యాయని జాయింట్ కలెక్టరు, మంగళగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి తెలిపారు. ఇప్పటివరకు మంగళగిరి నియోజకవర్గానికి సంబంధించి 26 మంది అభ్యర్థుల నుంచి 38 నామినేషన్లు వచ్చాయని వెల్లడించారు. స్వతంత్ర అభ్యర్థులుగా కాసాని సుధాకర్‌బాబు, జమ్ముల లోకేశ్వరరావు, పుచ్చల నాగేశ్వరరావు, గుత్తా నాగరాజు, షేక్ రహీమ్, చిక్కా బాల సూర్యప్రకాష్, వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య తరపున ఆమె ప్రతినిధులు మూడో సెట్, స్వతంత్ర అభ్యర్థిగా మురుగుడు సత్యం రెండో సెట్, జైభీమ్‌రావు పార్టీ అభ్యర్థి జడ శ్రావణ్‌కుమార్ తరపున ఆయన ప్రతినిధులు రెండో సెట్ నామినేషన్లను మంగళవారం ఆర్వో రాజకుమారికి అందజేశారు.

ప్రత్తిపాడు అసెంబ్లీకి ఆరు నామినేషన్లు దాఖలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 23: ప్రత్తిపాడు అసెంబ్లీ స్థానానికి సంబంధించి మంగళవారం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకర్ తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా కత్రి అరుణ్‌కుమార్, సీహెచ్ కృష్ణరాజులు, ఇండియన్ లేబర్ పార్టీ తరపున యండ్రపాటి పాల్, ఫిరమిడ్ పార్టీ తరపున చల్లా శరత్‌కుమార్ రెండో సెట్ దాఖలు చేశారు. జాతీయ జనసేనపార్టీ తరపున బుర్రి రాంబాబు, భారత చైతన్య యువజన పార్టీ తరపున సంకూరు స్తోత్రరాణి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్వో తెలిపారు.

టీడీపీ హయాంలోనే ముస్లిం మైనారిటీలకు మేలు

● టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఘని



ఇంటింటి ప్రచారం చేస్తున్న ముస్లిం నాయకులు

మేడికొండూరు, ఏప్రిల్ 23: తెలుగుదేశం పార్టీ హయాంలోనే ముస్లిం మైనారిటీలకు మేలు జరిగిందని గుంటూరు పార్లమెంట్ టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఘని చెప్పారు. మేడికొండూరు మండలం డోకిపర్రు గ్రామంలోని ముస్లిం ఏరియాలో ఆయన మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ విదేశీ విద్యాపథకం ద్వారా పేద కుటుంబాలకు చెందిన అనేక మంది ముస్లిం విద్యార్థులు నేడు విదేశాల్లో ఉన్నత విద్య పూర్తి చేసుకొని మంచి ఉద్యోగాలు చేసుకుంటున్నారని అన్నారు. ఈ ప్రచారంలో పాల్గొన్న తాడికొండ మాజీ ఎంపీపీ రిజ్వాన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు దుల్హన్ పథకం, చిన్న చిన్న వ్యాపారులకి సబ్సిడీ రుణాలను అందించిందని అన్నారు. త్వరలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, రాగానే పేదలకు సూపర్-6 పథకాలు అందించడమే కాకుండా మైనార్టీలకు గతంలో ఉన్న పథకాలను తిరిగి అందిస్తుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా తెనాలి శ్రావణ్‌కుమార్‌ను, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పెమ్మసాని చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ తఫిక్, షేక్ బర్కత్ అలి, షేక్ సులేమాన్ బాబు, షేక్ మీరావలి, షేక్ నాగుల్ షరీఫ్ షేక్ ఖాదర్ వలి. షేక్ జమీల హఫీజ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తల్లికి మల్లెల పూజ



పోలేరమ్మతల్లికి మల్లెలపూజలో పాల్గొన్న భక్తులు

కాకుమాను, ఏప్రిల్ 23: మండల పరిధిలోని కొండ పాటూరులో ఉన్న భక్తుల పాలిట కొంగు బంగారం, కోరిన కోర్కెలు నెరవేర్చే కల్పవల్లిగా పేరొందిన పోలేరమ్మ తల్లి మల్లెపూలపూజ మంగళవారం వైభవంగా సాగింది. వేకువజాము నుంచే అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలో పూజారులు అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. ఆలయం ముందుభాగంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి వంశీకృష్ణల బృందం ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మల్లెపూలు, పసుపు, కుంకుమ, పండ్లు, నూనె, తదితరాల సామగ్రిని అందజేశారు ఆలయ ఆవరణలో భక్తులు పూజలు నిర్వహించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. .ఆలయ మండపం వద్ద ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కంఠమనేని నరేష్ దంపతులు, అలాగే కార్యనిర్వాహణ అధికారి సురేష్‌బాబు దంపతులు పూజలో పాల్గొన్నారు. అర్చకులు నిర్వహించిన పూజలను వీక్షించేందుకు ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. అనంతరం అమ్మవారి చరిత్రను అర్చకులు వివరించారు. పూజలో పాల్గొనేందుకు కొండపాటూరు, అప్పాపురం, కాకుమాను, గరికపాడు, కొమ్మూరు, పుసులూరు, తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 23: మండలంపరిధి పుల్లడిగుంట గ్రామానికి చెందిన వేముల నాగయ్య(32) సోమవారం సాయంత్రం గృహానికి పెయింట్ వేస్తూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. బంధువులు వైద్యం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ ఉదయ్ బాబు వెల్లడించారు. మృతుడు నాగయ్య తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



బ్యాంకులో ఓటు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అసిస్టెంటు రిటర్నింగ్ అధికారి శేషన్న, అసిస్టెంటు మున్సిపల్ కమిషనర్ అనూష తదితరులు

ప్రతి ఒక్కరూ ఓటు వేయండి

● అసిస్టెంటు రిటర్నింగ్ అధికారి శేషన్న

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 23: రానున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరూ తమ ఓటు వేయండని అసిస్టెంటు రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ బి శేషన్న పిలుపు నిచ్చారు. పట్టణంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కార్యాలయంలో మంగళవారం భారత ఎన్నికల సంఘం వారి ఆదేశాల మేరకు, రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్వీప్ (ఎస్‌వీఈఈపీ)లో భాగంగా బ్యాంకు అధికారులకు, ఖాతాదారులకు ఓటు వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకొని ధర్మబద్ధమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకోవాలని కోరారు. ప్రజలు విలువైన తమ ఓటు హక్కును స్వేచ్ఛగా ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి వినియోగించుకోవాలని కోరారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ ఏ.వి.ఆర్. పవన్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా యువత మంచి నాయకులను ఎన్నుకోవడానికి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శేషన్న బ్యాంకు అధికారులు, ఖాతాదారలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు జడ్.సుధాకర్, ఎస్ఎల్ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఏ రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా నాదెండ్ల నామినేషన్

తెనాలి రూరల్, ఏప్రిల్ 23: తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థిగా నాదెండ్ల మనోహర్ బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఉదయం 8 గంటలకు తెనాలి ఐతానగర్ నుంచి ఉమ్మడి పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని మనోహర్ నామినేషన్ వేయనున్నారు. తెనాలి టీడీపీ ఇన్‌చార్జ్ మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, బీజేపీ, జనసేన నాయకులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు సమాచారం. ఉమ్మడి పార్టీ శ్రేణులందరూ పెద్దఎత్తున తరలివచ్చి నామినేషన్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఉమ్మడి పార్టీల నాయకులు పిలుపునిచ్చారు.



మనోహర్‌కు సంఘీభావం తెలుపుతున్న నాయీబ్రాహ్మణ సంఘ పెద్దలు, సభ్యులు

నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తా

● నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 23: నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నాయీ బ్రాహ్మణసేవా సంఘం సభ్యులతో నాదెండ్ల మనోహర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తాము అధికారం చేపట్టిన వెంటనే నాయీ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి అవసరమైన ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. ఉమ్మడి అభభ్యర్థులుగా పోటీచేస్తున్న తనకు గాజు గ్లాసుపై ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వారిని మనోహర్ కోరారు. తొలుత సమావేశానికి వచ్చిన నాయిబ్రాహ్మణ సంఘ పెద్దలు మనోహర్‌కు గజమాల వేసి ఘనంగా సత్కరించారు. పలువురు సంఘపెద్దలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్లు పంపిణీ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 23: పెన్నీ మినిస్ట్రీస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేదలు, అనాథలు, యాచకులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. సంస్థ గౌరవాధ్యక్షురాలు జన్మదినం సందర్భంగా వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకులు దిలీప్ ఎరాజా, పలువురు సభ్యులు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి యాచకులు, పేదలు, అనాథలకు ఈ సేవా కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రదీప్, రావణ్, రమేష్, ప్రమోద్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు అండగా నిలుస్తా: ధూళిపాళ్ళ



నరేంద్రకుమార్‌కు సంఘీభావం తెలియజేస్తున్న రాష్ట్ర ఇమానే మజ్లిస్ కమిటీ నాయకులు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 23: ముస్లిం మైనార్టీలకు ఏ కష్టం వచ్చినా అన్నివేళలా అండగా నిలుస్తానని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ స్పష్టం చేశారు. మంగళవారం మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో నరేంద్రకుమార్‌ను రాష్ట్ర ఇమానే మజ్లిస్ కమిటీ, చేబ్రోలు అంజుమన్ కమిటీ సభ్యులు కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించి తమకు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ తనకు మద్దతు తెలిపిన మజ్లిస్ కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మొదటి నుంచి తమ కుటుంబం ముస్లిం మైనార్టీలకు అండగా ఉందని తెలిపారు. టీడీపీ హయాంలో ముస్లింలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. తొలిసారిగా మసీదులో దైవసేవలో ఉండే ఇమామ్‌లు, మౌజన్లకు వేతనాలు ఇచ్చామన్నారు. మసీదుల మరమ్మతులకు పెద్దఎత్తున నిధులు అందచేశామని గుర్తుచేశారు. పేద ముస్లిం యువతుల వివాహాలకు దుల్హన్ పథకాన్ని అమలు చేసినట్లు చెప్పారు. కానీ వైసీపీ వచ్చిన తర్వాత ముస్లింలకు పథకాలను నిలిపివేసి వారి సంక్షేమాన్ని వైసీపీ అడ్డుకుందని ఆరోపించారు. రానున్న రోజుల్లో కూటమి విజయానికి అండగా నిలవాలని కోరారు. అధికారంలోకి వస్తే ముస్లింల కోసం వారి ప్రగతి కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చేబ్రోలు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు హర్షద్ బాషా, మజ్లిస్ కమిటీ అధ్యక్షుడు ఫరీద్, ముజీబ్, మునీర్, షరీఫ్, కాజా, సుభాని, కుత్బుద్దీన్, నాగూర్ వలీ, మౌలానా మసూద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన వైసీపీ మైనార్టీ నాయకులు మంగళవారం నరేంద్రకుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పఠాన్ సుభాని ఖాన్, బూత్ కన్వీనర్ షేక్ మీరా, పఠాన్ అయూబ్ ఖాన్ తదితరులు టీడీపీ జెండాలు కప్పుకొని పార్టీలో చేరారు. నరేంద్ర గెలుపుకోసం శక్తివంచన లేకుండా శ్రమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చేబ్రోలు మండల నాయకులు పాల్గొన్నారు.

దేవాలయంలో వైసీపీ సమావేశం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 23: పొన్నూరు పట్టణంలోని సహస్రలింగేశ్వర, వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం వైసీపీ రహస్య సమావేశం నిర్వహించటం వివాదస్పదమైంది. ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య మంగళవారం పొన్నూరు రావడంతో అయన, మరి కొంత మంది వైసీపీ నాయకులు ఆలయంలోని పాలక మండలి సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. వైసీపీ కార్యకర్త రామకృష్ణ నిబంధనలు ఉల్లంఘించి మరి పాలకమండలి కార్యాలయంలో నాయకులకు అల్పాహార విందు అందజేశారు. కొందరు ఆలయ అర్చకులు కూడా ఎంపీ అభ్యర్థిని కలిసి సత్కరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పటికి వాటిని ఖాతరు చేయకుండా దేవాలయంలో సమావేశం నిర్వహించడంపై ప్రతిపక్ష టీడీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయటంతో పాటు రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. ఆలయంలో వైసీపీ ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య రహస్య సమావేశం నిర్వహించటంపై ఆలయ ఈవో పి.శ్రీనివాసును వివరణ కోరగా సమావేశం గురించి తనకు తెలియదని తాను గుంటూరు ఆఫీసు పని మీద వెళ్లినట్లు సమాధానం చెప్పారు. ఈవోకు తెలియకుండా ఆలయం సిబ్బంది కార్యాలయ తాళాలు తీసుకొని సమావేశాలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వటానికి సాహసించరని భక్తులు తెలుపుతున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికి ఆలయంలోకి వైసీపీ నాయకులు ప్రవేశించటం, రహస్య సమావేశం నిర్వహించటంపై భక్తుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అధ్వానంగా జగ్గడిగుంటపాలెం చెరువు

● నెరవేరని చెరువు అభివృద్ధి.. వాకింగ్‌ట్రాక్ హామీ

● రహదారులపైనే గ్రామస్థుల నడక

తెనాలి రూరల్, ఏప్రిల్ 23: తెనాలి నియోజకవర్గంలోని జగ్గడిగుంటపాలెం చెరువు అధ్వానంగా తయారైంది. ఎమ్మెల్యే శివకుమార్ ఐదేళ్ల కిందట ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు నీటిమూటలయ్యాయి. ఆనాడు గ్రామంలో పర్యటిస్తూ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ సమస్యలను పరిష్కరిస్తానంటూ హామీల జల్లులు కురిపించారు. అందులో ఒకటి చెరువును పూడికతీసి అందులో వ్యర్థాలు తొలగించి తాగునీరు నిలిచేలా అభివృద్ధి చేసి దాని చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామన్నాడు. అయితే ఐదేళ్లయినా హామీ నెరవేర్చకపోవటంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెరువును అభివృద్ధి చేయకపోగా గ్రామంలో సేకరించిన చెత్తను ఆ చెరువులో వేసి డంపింగ్ యార్డులా మార్చటంతో గ్రామస్థులు మరింత ఇబ్బంది పడుతున్నారు. దీనిపై గతంలో పలుమార్లు చెత్తతగలబెట్టడంతో వస్తున్న పొగతోపాటు వ్యర్థాలతో చెరువు కలుషితమై దోమలు పెరిగి దుర్గంధభరితంగా మారి తమ ఆరోగ్యాన్ని క్షీణింపచేస్తోందని పలుమార్లు ఆందోళన చేశారు. అయినా పరిస్థితిలో మార్పురాలేదు. ప్రస్తుతం ఆ చెరువు వ్యర్థాలతో సగభాగం పూడిక తీసి మరో సగభాగం మురుగునీరు నిలిచి పెద్దపెద్ద చెట్లు పెరిగి చిట్టడివిగా మారింది. అయితే వైసీపీ చోటా నాయకులు ఆ పూడ్చిన చెరువు స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మరలా ఎమ్మెల్యే ఏ విధమైన హామీలతో ప్రచారం చేస్తారో చూడాలని పలువురు గ్రామస్థులు వ్యాఖ్యానించారు. గ్రామంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం వేసిన రోడ్లపైనే పలువురు వాకింగ్ చేస్తున్నారు.



డంపింగ్ యార్డులా అధ్వానంగా తయారైన జగ్గడిగుంటపాలెం చెరువు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్

మహిళా చట్టాలపై విద్యార్థినులకు అవగాహన

తెనాలి అర్బన్, ఏప్రిల్ 23: జేఎంజే కళాశాలలో మహిళా చట్టాలపై మంగళవారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ప్రభాకర్ విద్యార్థులకు మహిళా చట్టాల గురించి వివరించారు. అక్రమ రవాణా, యువతుల విక్రయం, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ వంటి పలు అంశాలను తెలిపారు. మేరీకుమారి, జ్యోతి, విశ్రాంతమ్మ, జెన్నిమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 23: కన్నెగంటి రెడ్డెమ్మ చౌదరి అన్నపూర్ణాదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. నాజరుపేటలోని హిందీ ప్రేమీ మండలిలో యోగా, కూచిపూడి, కర్ణాటక సంగీతం, డ్రాయింగ్, సంస్కృతం, తెలుగు భాషలో ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయని మే 1 నుంచి జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు లోకేశ్ రచ్చబండ

మంగళగిరి, ఏప్రిల్ 23: మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ బుధవారం మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు. సాయంత్రం 4గంటలకు చినకాకాని, 5:30 గంటలకు ఎర్ర బాలెం గ్రామం, 7 గంటలకు తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరంలో జరిగే రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించుకుందాం

● ఇంటింటి ప్రచారంలో టీడీపీ శ్రేణులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 23: రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించుకుందామని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు పట్టణంలోని 12వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌ను గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వార్డు ప్రజలకు విజ్ఞప్తిచేసి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అత్తోట వందనం, పినపాటి రవీంద్ర, మల్లవరపు విజయ్‌కుమార్, బొబ్బిళ్ళపాటి లక్ష్మణ్, బుస్సా సుబ్బారావు, కిరణ్, గాజులవర్తి సురేష్, కొమ్మూరి వెంకటేశ్వర్లు పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపేరంటాళ్లమ్మ తిరునాళ్ల

కొల్లిపర, ఏప్రిల్ 23: మండల పరిధిలోని వల్లభాపురంలోని గాదె సర్విరెడ్డి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. పేరంటాళ్లమ్మ 510 సంవత్సరాల చరిత్ర కలిగి విశేష పూజలందుకుంటుంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. తొలుత సర్విరెడ్డి పేరంటాళ్లమ్మ దంపతుల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సర్విరెడ్డి, పేరంటాళ్లమ్మ విగ్రహాలను ఆలయానికి తీసుకు రావడంతో భక్తులు ఆలయం చుట్టూ ట్రాక్టర్లను, పసుపు బండ్లను ప్రదక్షణలు చేయించారు. మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. మంగళవారం రాత్రి సమయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్థానిక నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పేరంటాళ్లమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

చేతులు కలిపిన ఒక నాటి ప్రత్యర్థులు

● నరేంద్ర, రావి చర్చలపై సానుకూల వాతావరణం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 23: రాజకీయ రంగంలో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని రాజకీయ పండితుల మాట. నేడు పొన్నూరులో ఆ మాటే నిజమైంది. ఒక నాటి ప్రత్యర్థులు అయిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, రావి వెంకట రమణలు ఒకే పార్టీ గొడుగు కిందకు వచ్చి సమన్వయంగా చర్చలు జరపటం ఇద్దరు అభిమానుల నుంచి సానుకూలత వ్యక్తం అవుతోంది. ఈ ఇద్దరి కలియక ఎన్నికల వేళ పొన్నూరులో ఆసక్తికరంగా మారింది. నిన్న మొన్నటివరకు రాజకీయ రణక్షేత్రంలో మాటల తూటాలు విసురుకొని, ఒకరిపై మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. ఎదురుపడిన ప్రతి సందర్భంగా పొన్నూరులో ఉద్రిక్తతలు ఏర్పడేవి. ఈ రెండు వర్గాలు రాజకీయ కార్యకలాపాల సందర్భాలలో ఎదురైనప్పుడల్లా ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. అలాంటి ప్రత్యర్థివర్గాలు నేడు పొన్నూరులో చేతులు కలిపి రానున్న ఎన్నికలో కలిసికట్టుగా ముందుకు సాగుతున్నారు.



పొన్నూరులో సమావేశమైన ధూళిపాళ్ళ, రావి వెంకట రమణ

పైసల కోసమే పెమ్మసానిపై పేటీఎం బ్యాచ్ ఆరోపణలు

● రజక సంఘం నేత కంచర్ల శ్రీనివాసరావు

గుంటూరు, ఏప్రిల్ 23: వైసీపీ నాయకులు విదిల్చే పైసల కోసమే కొందరు రజక సంఘాల నాయకుల ముసుగులో గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌పై అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నారని రజక సంఘం నేత కంచర్ల శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొరిటపాడులోని కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ నేతల వద్ద ముడుపులు అందుకున్న కొందరు పేటీఎం బ్యాచ్ రజక సంఘాల పేరుతో చలామణీ అవుతూ పెమ్మసాని రజకులను తూలనాడాడంటూ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పెమ్మసానిపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. పశ్చిమ నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన రజక మహిళ మాధవి ఘన విజయంతో అసెంబ్లీలోకి అడుగు పెట్టటం ఖాయమని స్పష్టం చేశారు.

రేపు గుంటూరుకు ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రాక

గుంటూరు, ఏప్రిల్ 23: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం గుంటూరు నగరంలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న ఆమె నగరంలో రోడ్‌షో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. గురువారం మధ్యాహ్నం గుంటూరు చేరుకోనున్న ఆమె సాయంత్రం సంజీవయ్యనగర్, రాజీవ్‌గాంధీనగర్, శారదాకాలనీ ప్రాంతాల్లో పర్యటిస్తారు. అనంతరం రోడ్‌షో నిర్వహించి ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు.